
శబరి శ్రీరామక్షేత్రంలో కొలువుదీరిన ఉత్సవర్లు


శబరి శ్రీరామక్షేత్రంలో వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో శ్రీరామ నవమి వేడుకలు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటలకు శ్రీరామకోటి స్థూపం మైదానంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరగనుంది. ఉత్సవర్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు అందజేస్తారని ఆలయ చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. కాగా, శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా శనివారం క్షేత్రంలో సీతా జయంతి వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఉదయం కోదండరామస్వామికి అభిషేకం, తులసీ దళాలతో సహస్ర నామార్చన, హోమాలు జరిగాయి. సాయంత్రం అర్చన, సీతాదేవిని పెళ్లికూతురును చేయడం, తలంబ్రాలు, బియ్యం కలుపుట, తాంబూలం ఇచ్చి భక్తులను సీతారాముల కల్యాణానికి ఆహ్వానం పలికారు.


సిద్ధమైన కల్యాణవేదిక


తలంబ్రాలు కలుపుతున్న భక్తులు






విద్యుద్దీప అలంకరణలో కోవూరు, అల్లూరులోని కోదండరామస్వామి ఆలయాలు

సుందర కాండ పఠించాలి

ముఖ్యంగా శ్రీరామనవమి రోజున భక్తులంతా శ్రీరాముడిని స్మరించుకుని సుందరకాండను పఠించాలి. సంతోషకర జీవితం కోసం సీతారాములను పూజించాలి. కష్టాల నుంచి విముక్తి పొందడానికి గంగా జలాన్ని, ఏదైనా పవిత్ర నది నీటిని ఒక పాత్రలో తీసుకుని 'ఓం శ్రీ హ్రీం క్లీం రామచంద్రాయ శ్రీ నమః' అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలని పండితులు చెబుతున్నారు.

పూజా విధానం

శ్రీరామ నవమి రోజున సూర్యోదయం కంటే ముందే నిద్ర లేవాలి. ఇంట్లో మామిడి ఆకులు, కొబ్బరి కాయను కలశంపై ఉంచాలి. శ్రీ సీతా రాములకు ధూపం, దీపం, పండ్లు, పువ్వులు, వస్త్రాలు సమర్పించాలి. శ్రీరాము డికి నైవేద్యం సమర్పించి పూజ పూర్తయిన తరువాత విష్ణు సహస్రనామం పఠించి హారతి ఇవ్వాలి. నవమి రోజున పానకం, వడపప్పు తయారుచేసి మహా ప్రసాదంగా స్వీకరిస్తారు. దీని వెనుక ప్రకృతి పరమార్థము లేకపోలేదు. ఇది వేసవికాలం కావడంతో వీటిని ప్రసాద రూపంలో సేవించడం వల్ల ప్రజల ఆరోగ్యం, ఆయుష్మ అభివృద్ధి కలుగుతాయని ఆయుర్వేద పండి తులు అభిప్రాయం. వసంత రుతువులో వచ్చే గొం తు వ్యాధులకు పానకంలో వినియోగించే మిరియాలు, యాలకులు ఉపశమనాన్ని ఇస్తాయని, ఔషధంలా పని చేస్తాయి. పెసరపప్పును వడపప్పు అంటారు. పెసరపప్పు శరీరంలోని ఉష్ణాన్ని తగ్గించి, చలువ చేస్తుంది. జీర్ణశక్తిని వృద్ధి చేస్తుంది.

రామ.. రామ.. జయసీతారామ!

శ్రీరాముడు మానవాళికి మార్గదర్శకుడు. ఉత్తమ మానవుడి లక్షణాలు ఎలా ఉండాలో ఆచరించి చూపిన మహనీయుడు. అంతటి మహాపురుషుడి జన్మదిన వేడుకే శ్రీరామనవమి. ధర్మానికి ప్రతిరూపమైన శ్రీరాముడిని కీర్తిస్తూ భక్తజనం పండుగ జరుపుకుంటున్న శుభ తరుణమిది. హిందువులు ఎంతో పవిత్రంగా జరుపుకునే ఈ పండుగకు ప్రత్యేకమైన ఆధ్యాత్మికత, సాంస్కృతిక, పౌరాణిక ప్రాధాన్యతలు ఉన్నాయి. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా ఆ జానకీరాముడిని కొలిచేందుకు జిల్లాప్రజానీకం సిద్ధమైంది. ఇప్పటికే రామమందిరాలు ముస్తాబయ్యాయి.

- ఆధ్యాత్మిక లోగిలి.. కోదండరాముడి సన్నిధి
- నేడు శ్రీరామనవమి పర్వదినం
- ముస్తాబైన జానకీరాముడి ఆలయాలు

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ చంద్రుడిని తెలుగువారు ప్రతి ఇంటా ఇలవేల్పుగా కొలుస్తారు. హిందూ మత విశ్వాసాల ప్రకారం దశరథుడు, కౌసల్య దంపతులకు త్రేతాయుగంలో చైత్ర శుద్ధ నవమి రోజున, వసంత రుతువు కాలంలో శ్రీరాముడు జన్మించాడు. 14 సంవత్సరాల వనవాసం తరువాత రావణ సంహారం అనంతరం శ్రీరాముడు సీతాసమేతంగా అయోధ్యలో సింహాసనాన్ని అధిష్టిస్తారు. నవమి రోజున సీతారాముల కల్యాణం జరిగిందని, పట్టాభిషేకం కూడా అదే రోజు జరిగిందని చెబుతారు. శ్రీరామనవమి రోజున రామ నామ స్మరణ చేయడం వల్ల అనేక రెట్లు పుణ్యఫలం లభిస్తుందని భక్తులకు ప్రగాఢ విశ్వాసం. అందుకే ఈ పవిత్రమైన రోజున ప్రతి ఏడాది శ్రీరామనవమి వేడుకలను జరుపుకుంటారు. జిల్లావ్యాప్తంగా అన్ని ఆలయాల్లో పందిళ్లు వేసి సీతారామకల్యాణం జరుపుతారు. ఈ వేడుకలో తలంబ్రాలను పెళ్లి కానివారు అక్షింతలుగా వేసుకుంటే పెళ్లి కుదురుతుందని నమ్మకం.

● దాన ధర్మాలు చేయాలి

పురాణాల ప్రకారం రాముడు పసుపు రంగు వస్త్రాలు ఇష్టపడతాడని తెలుస్తోంది. దీంతో రామాలయాల్లో పసుపు వస్త్రాలు సమర్పిస్తే శ్రీరాముడు సంతోషిస్తాడని, తమ ఇళ్లలో ఆనందం పెరుగుతుందని, శుభ ఫలితాలు వస్తాయని భక్తుల విశ్వాసం. అలాగే పేదలకు అన్నం, బట్టలు తదితర వస్తువులను దానం చేయాలి. దీనివల్ల పుణ్యఫలం దక్కుతుందని పండితులు చెబుతున్నారు.

SUNDAY SPECIAL

ఆనందవనం

- 50 హెక్టార్లలో సుందరప్రాంతం
- తరలివస్తున్న ప్రకృతి ప్రేమికులు

చుట్టూ అటవీ ప్రాంతం.. పచ్చని చెట్లు.. వాటిల్లో నుంచి పక్షుల కిలకిలరావాలు.. మనసును హాయిగొలిపే ఆహ్లాదకర వాతావరణం.. ఇవన్నీ నగరవనం సొంతం. సాయంసంధ్యవేళ ప్రశాంతంగా కూర్చోవడానికి పచ్చిక బయళ్లు.. పిల్లలకు ఆటవస్తువులు.. ట్రక్కింగ్ ట్రాక్.. కళ్లను కట్టిపడేసే వన్యప్రాణుల బొమ్మలు.. మ్యూజికల్ ఫౌంటెన్ అబ్బో ఇలా చెప్పుకుంటూ పోతే నగరవనంలో చాలానే ఉన్నాయి. నెల్లూరుకు పది కి.మీ దూరంలో ఉన్న ఈ సుందర పార్కులో సేద తీరేందుకు నగరవాసులే కాదు.. దూరప్రాంతాల నుంచి కూడా తరలివస్తున్నారు. చిన్నా పెద్ద అని తేడాలేకుండా అందరినీ ఆకట్టుకుంటున్న 'నగరవనం'పై ఆంధ్రజ్యోతి ఆదివారం ప్రత్యేక కథనం...

- నెల్లూరు (వెంకటేశ్వరపురం, ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత పరుగు ప్రపంచంలో సెలవు దొరికితేచాలు జిల్లావాసులు మైపాడు, కోడూరు వంటి తీరప్రాంతాలకు వెళ్లి సేదతీరుతారు. మరికొందరు ఆలయాలకు వెళతారు. ఇంకొందరు నగరంలో ఉన్న పార్కుల్లో గడుపుతారు. నగర, పట్టణవాసుల సౌలభ్యం కోసం నగరానికి కూతవేటు దూరంలో అంటే కొత్తూరు సమీపంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నగరవనం అందరినీ ఆకట్టుకుంటోంది. నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల ప్రాంతంలో దాదాపు 125 హెక్టార్ల అటవీ ప్రాంతంలో ఈ సుందర ప్రాంతం ఏర్పాటుకు 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పునాది వేసింది. మొదటి విడతలో 50 హెక్టార్లలో పార్కును అభివృద్ధి చేశారు. ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వం రూ.1.40 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2.10 కోట్లు మంజూరు చేశాయి.


సందడిగా ఉన్న పిల్లల పార్కు

3 నెలల్లో పూర్తిస్థాయిలోకి..

రాష్ట్రంలోనే అతిపెద్ద పార్క్‌గా నెల్లూరు నగరవనాన్ని రూపొందిస్తున్నాము. ఇప్పటివరకు రూ3.5 కోట్లతో దాదాపు 50హెక్టార్లలో అభివృద్ధి చేశాము. ఇంకా కొంత చేయాల్సి ఉంది. నెల రోజుల్లో కేంద్రం మంజూరు చేసిన రూ.60లక్షలు వస్తాయి. ఈ నిధులతో పార్కును అభివృద్ధి చేసి, మూడు నెలల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తాము. ఆహ్లాదకరంగా పచ్చని ప్రకృతిలో గడపాలనే వారు తప్పనిసరిగా నెల్లూరు నగరవనానికి రండి.

- మహబూబ్‌బాషా, డీఎఫ్‌వో

● ఆహ్లాదానికి.. ఆటలకు ప్రత్యేకం


నగరవనంలో పర్యాటకులు ఆహ్లాదకరంగా గడిపేందుకు అటవీ శాఖ అనేక ఏర్పాట్లు చేసింది. పిల్లల కోసం ప్రత్యేక పార్కును ఏర్పాటు చేశారు. అలాగే, వాకింగ్ ట్రాక్, ట్రెక్కింగ్ ట్రాక్, ప్రకృతి వ్యూ పాయింట్లు, యోగా సెంటర్, క్యాంటీన్, మ్యుజికల్ ఫౌంటెన్, ఓపెన్‌జిమ్, ఫొటో షూట్ ప్రాంతం, ఫంక్షన్ హాల్, వన్యప్రాణుల బొమ్మలతో కూడిన ఆర్చీలు ఇలా ఎన్నో నగరవనంలో ఉన్నాయి.

● ప్రవేశ రుసుము

నెల్లూరు నగరవనంలో ప్రవేశానికి గత ఏడాది జూన్ నుంచి అటవీశాఖ పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10 చొప్పున రుసుము వసూలు చేస్తోంది. అలాగే, ఫొటోషూట్‌లకు రూ.500, మినీ ఫంక్షన్ హాల్‌కు రూ.5వేలు (రోజుకు), పెద్ద ఫంక్షన్ హాలుకు రూ.10వేలు (రోజుకు) చొప్పున నిర్ణయించారు. వీటితోపాటు ఓపెన్ ఫంక్షన్ హాలు, ఓపెన్ ఆడిటోరియం సైతం అందుబాటులో ఉంది. అలాగే, పుట్టినరోజు వేడుకలు, చిన్న చిన్న శుభకార్యాలు, మిత్రుల సమావేశాలు కూడా జరుపుకొనేందుకు అద్దెకు ఇస్తున్నారు. ఇలా నెలకు అటవీశాఖకు రూ.3లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నగరవనంలోకి అనుమతి ఉంటుంది. త్వరలో సినిమా షూటింగ్‌లకు సైతం నగరవనాన్ని అద్దెకు ఇవ్వనున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.








జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ తదితరులు

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ఉపప్రధాని, సంఘ సంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్‌కు ప్రజాప్రతినిధులు, ప్రజాప్రతినిధులు ఘన నివాళులర్పించారు. శనివారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నగరంలోని వేదాయపాళెంలో ఉన్న ఆయన విగ్రహానికి కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్యమాదిగ తదితర ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు కాగా, టీడీపీ నేతలు జన్నిరమణయ్య మాదిగ, మందా మస్తానయ్య ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు కట్ చేసి, అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో సంఘిక సంక్షేమ శాఖ డీడీ శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, ఎంఆర్‌పీఎస్ జిల్లా కోఆర్డినేటర్లు బెల్లంకొండ గోపి మాదిగ, కోలగట్ల రమేష్‌మాదిగ, భారత సేవా ఫౌండేషన్ జిల్లా కార్యదర్శి షేక్ ఖాసీం, కొమ్మల కృష్ణయ్య పాల్గొన్నారు.


భారీ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు

మామిడికి ప్రతికూలం!



- మంచుకుతోడు ఈదురుగాలుల ప్రభావం
- మాడిపోతున్న పూత, రాలిపోతున్న పిందె
- దిగుబడులపై తీవ్ర ప్రభావం

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి) : వెంటాడుతున్న తెగుళ్లు.. పెరుగుతున్న పెట్టుబడులతో ఏటా మామిడి రైతులు నష్టాలను మూట గట్టుకుంటున్నారు. పెట్టుబడి కింద రూ.లక్షలు ఖర్చు చేసినా ఆశించినస్థాయిలో దిగుబడి రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనూ కురుస్తున్న మంచు మామిడి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం పూత మాడిపోయి, పిందెలు మగ్గి రాలిపోతుండటంతో సాగుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా ఈదురు గాలులతో వర్షం కురుస్తుండటంతో చెట్లపై ఉన్న అర కొరగా కాయలు, పూత నేల రాలుతుండ టంతో రైతులు కోలుకోలేని పరిస్థితి నెలకొంది.

వాతావరణం అనుకూలించక

ఈ ఏడాది మామిడి రైతులకు వాతావరణ పరిస్థితులు ఆశించనంత అనుకూలంగా లేవు. కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు, కావలి, నెల్లూరు ప్రాంతాల్లో సుమారు 8 వేల హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. పొంగ మంచు ప్రభావం ఉండ టంతో పూత మాడిపోయి కొంత మేర రాలిపోతోంది. ఇందుకోసం రైతులు మందులు పిచికారి చేసినా ఫలితం ఉండటం లేదు. పూత పిందె దశకు చేరినా చెట్టు మీద నిలబడటం లేదు. సాధారణంగా లేత తోటలు అయితే ఎకరాకు 2 నుంచి 4 టన్నులు, ముదురు తోటలు అయితే 5 నుంచి 7 టన్నుల దిగుబడి రావాల్సి ఉంది. కానీ ఈ ఏడాది నెలకొన్న ప్రతికూల వాతావరణ పరిస్థితులతో దిగుబడి బాగా తగ్గిపోతుందని రైతులు అంటున్నారు.


అల్లూరు రోడ్డులో దోపిడీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్పీ రాహుల్ మీనా

8

రైలులో చోరీ కేసు.. ముగ్గురిని గుర్తించాం!

- మొత్తం ఆరుగురిగా అనుమానం
- త్వరలోనే నిందితుల అరెస్టు?
- గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్ మీనా
- ఘటనాస్థలిలో వివరాల సేకరణ

చలివేంద్రం ప్రారంభం

సంగం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటలతోపాటు సామాజిక సేవా కార్యక్రమంలో ముందుంటుందని సంఘం జిల్లా అధ్యక్షుడు రాజగోపాలచార్యులు పేర్కొన్నారు. శనివారం సంగంలో ఆయన ఆపస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని పురస్కరించుకుని ప్రయాణికుల కోసం చలివేంద్రం ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8559
వెండి కిలో ధర	రూ. 90,800
వెండి ఒక గ్రాము	రూ.93.80

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

● నారాయణరావు, గ్రంథపాలకుడు



అనంతసాగరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేసవి సెల వుల్లో విద్యార్థులు గ్రంథాలయా లను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక శాఖ గ్రంథాలయాధికారి దివానపు నారాయణరావు సూచించారు. పుస్తక పఠనం అలవర్చుకోవాలని కోరారు.

? వేసవిలో విద్యార్థులకు ఎలాంటి పోత్సాహం అందిస్తున్నారు.

! పాఠశాలలను సందర్శించి గ్రంథాలయాల వల్ల కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

? సభ్యత్వ నమోదు ఎలా... ప్రయోజనమేంటి.

! విద్యార్థులకు రూ. 50, పెద్దలకు రూ. 100 చొప్పున చెల్లించి సభ్యత్వం పొందవచ్చు. వారికి కావల్సిన పుస్తకాలు ఇళ్లకు తీసుకెళ్లి చదువుకోవచ్చు. 1,050 సభ్యత్వాలు చేశాం.

? విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ఉంటాయా.

! ఏటా వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. తద్వారా విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు ఏర్పడుతుంది. ఈసారి శిక్షణ తరగతులకు సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా అందలేదు.

? ఎలాంటి మెటీరియల్ అందుబాటులో ఉంది.

! పోటీ పరీక్షల మెటీరియల్‌తో పాటు, వివిధ రకాల గ్రంథాలు, దినపత్రికలు, ఆధ్యాత్మికం అన్నీ కలిపి 4,550 పుస్తకాలు ఉన్నాయి. తాగునీరు, ఫ్యాన్లు, కుర్చీలు తదితర వసతులు కల్పిస్తున్నాం.


పేదోడి ఫ్రిజ్‌లకు భలే గిరాకీ

అంతరిస్తున్న కులవృత్తులు

కనుమరుగవుతున్న కుండలు



ఆత్మకూరులో కుండలను కొనుగోలు చేస్తున్న మహిళలు



సారెపై కుండలు తయారు చేస్తున్న కుమ్మరి (ఫైల్)

ఆత్మకూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే పేదోడి ఫ్రిజ్ (కుండ)లకు భలే గిరాకీ. అయితే కుండల తయారీ కనుమరుగవడంతో దూరప్రాంతాల నుంచి తెచ్చి పట్టణాల్లో, మండల కేంద్రాల్లో, గ్రామాల్లో సైతం కుండలను అమ్ముతున్నారు. గతంలో గ్రామాల్లోనే కుమ్మరులు కుండలు తయారు చేయడంతో అతిచౌకగా లభించేవి. ఎండాకాలంలో ప్రతి ఇంటా తడిపిన పలుచటి గుడ్డ కట్టిన కుండ కనిపించేది. ప్రస్తుతం కుండల తయారీ క్రమేణా కనుమరుగవడంతో కొందరు పేదప్రజల ఇళ్లలో మాత్రమే వేసవిలో దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు రూ.10 ఉన్న కుండ ధర ప్రస్తుతం రూ. 250 నుంచి రూ. 350 వరకు అమ్మకాలు జరుపుతున్నారు. ప్రస్తుతం ఆత్మకూరు పట్టణంలో మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వద్ద దూరప్రాంతాల నుంచి కుండలను తెచ్చి విక్రయిస్తున్నారు. ఫిబ్రవరిలో మొదలైన కుండల వ్యాపారం జూన్ వరకు కొనసాగుతుంది.

కనుమరుగవుతున్న కులవృత్తులు

ఒకనాడు పల్లె అందాలకు వన్నె తెచ్చిన కులవృత్తులు కాలక్రమేణా కనుమరుగవుతున్నాయి. నాడు కుమ్మరి కుండలకు ఎంతో ప్రాముఖ్యత ఉండేది. ఇంట్లో చిన్న పాత్ర నుంచి వంట పాత్రల వరకు కుండలే వాడేవారు. కుమ్మరి కుండల తయారీలో నాణ్యత, నైపుణ్యం ప్రదర్శించేవారు. వేసవి వచ్చిందంటే ప్రతి ఒక్కరూ కుండలు కొని చల్లటి నీరు తాగేవారు. నేడు వాటి స్థానాన్ని ఫ్రిజ్‌లు ఆక్రమించాయి. దీంతో ఆ వృత్తివారు ప్రయత్నాయం కోసం పట్టణాల వైపు అడుగులు వేస్తున్నారు. ఈక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గంలో 6వేల కుటుంబాలకు పైబడి ఉండే కుమ్మరులు నేడు 100 కుటుంబాలు కూడా కులవృత్తిలో లేకపోవడం గమనార్హం. ఆత్మకూరు మండలం మొత్తంమీద ఒక్క గ్రామంలో కూడా కులవృత్తిని కొనసాగించే కుమ్మరులు లేకపోవడం బాధాకరం. ఇదేక్రమంలో అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల, మర్రిపాడు, సంగం, మండలాల్లో సైతం పలు కుటుంబాలు తమ చేతివృత్తిని వదిలి ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవడంతో కుండల తయారీ కనుమరుగైంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కుమ్మరులను ఆదుకోకపోతే గ్రామాల్లో కులవృత్తులు అంతరించి (పేదోడి ఫ్రిజ్) కుండలు కనుమరుగయ్యే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

ఆదర్శప్రాయుడు బాబు జగ్జీవన్‌రామ్



ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్, సిబ్బంది

ఆత్మకూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ ఆదర్శప్రాయుడని పలువురు కొనియాడారు. పట్టణంలో శనివారం యన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉప రవాణా శాఖ కార్యాలయంలో ఎంవీఐ రాములు, సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్, అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, ఆర్ఎం డాక్టర్ ఉషాసుందరి, పలువురు డాక్టర్లు, వైద్య సిబ్బంది నివాళులు అర్పించారు.

● ఉదయగిరి : మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, తహసీల్దారు, పంచాయతీ, ఎంఈవో కార్యాలయాలు, ఎంజీఆర్ ప్రభుత్వ వ్యవసాయ కళాశాల, ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ నాయకులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, పంచాయతీరాజ్ డీఈ మణికుమార్, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, మాజీ సొసైటీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డి, ఎంఈవో మస్తాన్‌వలి, ఉప సర్పంచ్ ముర్తుజా, ఎంపీటీసీ తిరుపతి, ఈవో కరీముల్లా, ఏపీవో శ్రీనివాసులు, టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు బొజ్జా నరసింహులు, బకీరు జాషువా, బెజవాడ బాలగురవయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● వింజమూరు: పట్టణంలోని బంగ్లాదేశ్ సెంటర్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ డీఎంహెచ్ఓ డాక్టర్ మాసిలామణి, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పండిట్ అంబేడ్కర్ మాదిగ పాల్గొని అంబేడ్కర్, జగజ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి మండల అధ్యక్షుడు గోచిపాతల ఆనంద్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు రందాస్, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగపట్ల వెంకయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు, ఎంఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

● సీతారామపురం : బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల కార్యాలయాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కలివెల జ్యోతి, జాషువా, అబ్రహం, రమణయ్య, ఎలిషాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాల ప్రారంభం

సంగం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న సంగమేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు శనివారం అంకురార్పణతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేదపండితులు పెన్నానది జలాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం వేద మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ అంకురార్పణ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అర్చకులు టంగుటూరి గోపాలకృష్ణమూర్తి, వెంకటలక్ష్మి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

సోమశిలలో 52.789 టీఎంసీల నీరు

అనంతసాగరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సోమశిల డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి 52.789 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 699 బేళ్లను తీసుకొని రాగా 14 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 511 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 188 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ. 280 కాగా, కనిష్ట ధర రూ. 230 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

నవమి వేడుకలు ప్రారంభం



ప్రత్యేక పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామ స్వామి ఆలయంలో శనివారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అంకురార్పణతో ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా అర్చకులు స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చు కున్నారు. పది రోజులపాటు ఉత్సవాలను నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

కాలువలో పూడికతీత పనుల ప్రారంభం



కాలువలో పూడిక తీస్తున్న యంత్రం

సంగం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సంగం వద్ద కనిగిరి ప్రధాన కాలువ క్రాస్ రెగ్యులేటరు నుంచి ప్రారంభమయ్యే బెజవాడ పాపిరెడ్డి (కావలి) కాలువలో శనివారం పూడికతీత పనులు ప్రారంభించారు. పూడికతీత పనులకు సుమారు రూ. 4.6 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ వరికోతల సీజన్ ముగియడంతో కాలువకు నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో పూడికతీత పనులను ప్రారంభించారు. మండల పరిధిలోని 15 కిలోమీటర్ల కాలువ పొడవునా సంగం, తలుపూరుపాడు, చెన్నవరపాడు, మర్రిపాడు తదితర ఐదుచోట్ల యంత్రాలతో పూడికతీత పనులు చేపట్టారు. ఈనెలాఖరకు పూడికతీత పనులు పూర్తిచేసి మే నెల నుంచి ఎడకారుకు సాగునీటిని విడుదల చేసేందుకు పూడికతీత పనులు ప్రారంభించారు.



పాఠశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఎంఈవో మస్తాన్‌వలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు బోయమడగల ప్రాథమిక పాఠశాలలో శనివారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మస్తాన్‌వలి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతోపాటు క్రమశిక్షణకు ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం తరగతుల వారీగా ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. తొలుత దివంగత ఉప ప్రధాని బాబు జగ్జీన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు, హెచ్ఎం రమేష్, టీడీపీ నాయకులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

ఉదయగిరి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాహ్మణ వీధిలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కల్యాణోత్సవానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులవ్వాలని వారు కోరారు.

కళాశాల భవన నిర్మాణ పనుల పరిశీలన



బెడ్ కాంక్రీట్ పనులు పరిశీలిస్తున్న ఈఈ, ఏఈలు

ఉదయగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న భవన నిర్మాణ బెడ్ కాంక్రీట్ పనులను శనివారం ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ రమణయ్య, ఏఈ శ్రావణ్ కుమార్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉషశ్రీ పథకం కింద కళాశాలకు రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. అందులో రూ.3.50 కోట్లతో తరగతి గదులు, రూ.0.75 లక్షలతో తరగతి గదుల మరమ్మతు పనులు, రూ. 0.75 లక్షలతో కళాశాలకు ఫర్నీచర్, ల్యాబ్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. నవంబరు నాటికి భవన నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్లు గడ్డం శ్రీనివాసులు, బొజ్జా శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గుంతలు పూడ్చివేత



రహదారిపై గుంతలు పూడ్చుతున్న అధికారులు

సంగం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సంగం పెన్నా ఆనకట్ట కనిగిరి ప్రధాన కాలువ వంతెన ప్రవేశ ద్వారం వద్ద రహదారిపై ఏర్పడిన గుంతలను శనివారం వెట్‌మిక్స్‌తో పూడ్చివేశారు. ఆనకట్ట సమీపంలో ఉన్న సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడంతో గుంతల వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో ఎస్ఐ రాజేష్ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వెట్‌మిక్స్‌తో గుంతలను పూడ్చివేశారు.

నీటి వృథా పట్టదా?

ఉదయగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నీటి సరఫరా జరిగే సమయంలో పైపులు ధ్వంసమై, కొళాయిలకు డమ్మీలు, ట్యాపులు లేకపోవడం, వాల్వులు, సింథటిక్ ట్యాంకుల వద్ద లీకేజీల రూపేణా నీరు వృథాగా పోతోందని, దీంతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని పట్టణ వాసులు వాపోతున్నారు. ప్రధానంగా పట్టణంలోని మెయిన్‌బజార్, అగ్రహారం, నాగులబావి వీధి, కొళ్లవీధి, చిన్న మసీదు, అటవీ శాఖ కార్యాలయం, యాదవపాళెం, వాయుగుండ్లవారివీధి తదితర ప్రాంతాల్లో పంచాయతీ వారు నీటిని సరఫరా చేసే సమయంలో నీరు వృథాగా పోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టి నీటి సరఫరా సజావుగా జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

ఆర్టీసీ బస్సు, సిమెంట్ ట్యాంకర్ ఢీ

● 11 మందికి గాయాలు



క్షతగాత్రులకు వైద్య సేవలు చేస్తున్న వైద్య సిబ్బంది

సంగం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు - సిమెంట్ ట్యాంకర్ ఢీకొని 11 మందికి గాయాలైన సంఘటన సంగం - ముంబాయి జాతీయ రహదారి కూడలిలో శనివారం ఉదయం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నెల్లూరు నుంచి పామూరుకు వెళ్తూ మార్గమధ్యంలో సంగం బస్టాండ్‌లోకి వెళ్లింది. అనంతరం బస్సు కలిగిరి రహదారిలోకి వెళ్లేందుకు సంగం-ముంబాయి జాతీయ రహదారి కూడలి దాటుతుండగా నెల్లూరు నుంచి కడప వైపు వేగంగా వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ బస్సును మధ్యలో ఢీకొంది. దీంతో బస్సులో 31 మంది ప్రయాణికులు ఉండగా అందులో 11 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సంగం ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో సంగం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం క్షతగ్రాతుల్లో కొందరిని ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు, మరికొందరిని నెల్లూరుకు తరలించారు. బస్సును పక్కకు తీసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

రాపూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలం పులిగిలపాడు వద్ద శనివారం సాయంత్రం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. జోరేపల్లి గ్రామానికి చెందిన వల్లూరు జగదీష్ బైక్‌పై రాపూరుకు వస్తుండగా ఎదు రుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయ పడిన జగదీష్‌ను చికిత్స కోసం గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

దర్గాలో సలాం విషయంలో వివాదం

● ఎస్ఐ చొరవతో సమస్య పరిష్కారం

ఏఎస్ పేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఖాజా నాయబ్ రసూల్ దర్గాలో ప్రతిరోజు రాత్రి జరిగే సలాం విషయంలో సజ్జాదా హఫీజ్ పాషాకు దర్గా ఈవో హుసేన్‌కు మధ్య శుక్రవారం రాత్రి వివాదం జరగడంతో ఉద్రిక్తత నెలకొంది. వివరాల మేరకు కోర్టు ఉత్తర్వుల ప్రకారం సజ్జాదా హఫీజ్ పాషా దర్గాలో ప్రార్థనలు, సలాంలు చేసుకోవచ్చు, అతను లేని సమయంలో ఇమామ్ సలాం చేస్తారు. అలాకాకుండా శుక్రవారం రాత్రి హఫీజ్‌పాషాకు సంబంధించిన ఇతర వ్యక్తులు సలాం చదవడానికి ప్రయత్నించడంతో దర్గా ఈవో హుసేన్ అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగి గొడవకు దారితీసింది. దీంతో హఫీజ్‌పాషా తమ హక్కులను అడ్డుకుంటున్నారని దర్గా ముందు బైఠాయించి నిరసనకు దిగడంతో దర్గాలో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సైదులు తన సిబ్బందితో కలసి దర్గాకు విచ్చేసి ఇరువురితో చర్చించి సమస్యను పరిష్కరించడంతో సజ్జాదా హఫీజ్ పాషానే సలాం చదివారు.

కుమార్తె ఆచూకీ తెలపాలని డీఎస్పీ కార్యాలయం ఎదుట తల్లి ఆందోళన

ఏఎస్ పేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కుమార్తె ఆచూకీ తెలపాలని కోరుతూ ఆత్మకూరు డీఎస్పీ కార్యాలయం ముందు ఓ తల్లి గ్రామస్థులతో కలిసి శనివారం ఆందోళన చేపట్టింది. వివరాల మేరకు.. రాజవోలు గ్రామానికి చెందిన హబీబా కుమార్తె ఆత్మకూరు ఏఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో చదువుతోంది. ఈనేపథ్యంలో సుమారు నెల రోజుల క్రితం ఆమె ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఏఎస్ పేట పోలీస్‌స్టేషన్‌లో హబీబా ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి కుమార్తె ఆచూకీ కోసం పోలీసుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని, దీంతో ఆత్మకూరు డీఎస్పీకి మొర పెట్టుకునేందుకు వచ్చినట్లు బాధితురాలు, గ్రామస్థులు తెలిపారు. కాగా, డీఎస్పీ లేకపోవడంతో సీఐ గంగాధర్ ప్రత్యేక బృందాలతో గాలింపు చేపడతామని హామీ ఇవ్వడంతో వారు వెనుతిరిగారు.

మహిళ పర్సులో నగదు మాయం

● పోలీసులకు ఫిర్యాదు




బస్టాండ్ ప్రాంతంలో విచారణ జరుపుతున్న ఎస్ఐ

ఉదయగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్ర జ్యోతి): బంగారం కొనేందుకు వచ్చిన ఓ మహిళ పర్సులో నగదు మాయమైన సంఘటన శనివారం ఉదయగిరిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు.. మండలం లోని మాసాయిపేట గ్రామానికి చెందిన పిడతల తిరుపతమ్మ బేల్దారి కూలి పనులు చేసుకుంటూ రూ.30 వేలు కూడబెట్టింది. ఆ నగదుతో బంగారు చెవి కమ్మలు కొనేందుకు మరో ఇద్దరి మహిళ లతో కలిసి ఆటోలో ఉదయగిరికి వచ్చింది. అనంతరం బంగారం దుకాణానికి వెళ్లి చూడగా పర్సు మాత్రమే ఉంది. అందులో ఉంచిన నగదు కనిపించలేదు. దీంతో నగదు ఎక్కడ జారిపోయిందని ఆటో దిగిన దగ్గర నుంచి బంగారం దుకాణం వరకు గాలింపు చేపట్టింది. అయినా కనిపించపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో కలిసి బస్టాండ్‌కు చేరుకుని విచారణ చేసి, గాలింపు చేపట్టినా ఫలితంలేదు. చేసేదేమీ లేక కష్టార్జితం పరులపాలైందని తిరుపతమ్మ నిరాశగా వెనుతిరిగింది.

రైస్‌మిల్లుపై అధికారుల దాడులు

● 184.25 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

జలదంకి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జలదంకిలోని ఎల్ఆర్ అగ్రహారం రోడ్డులో ఉన్న గోకుల కృష్ణ రైసుమిల్లుపై శనివారం పౌర సర ఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు స యుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 184.25 క్వింటాళ్ల రేషన్ బియ్యంను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ బియ్యాన్ని కావలి ఎంఎస్ఎస్ పాయింట్‌కు తరలించారు. రైస్‌మిల్లు యజమానిపై 6ఎ కేసుతో పాటు నమోదు చేశారు. అలాగేఅతనిపై జలదంకి పోలీసుస్టేషన్‌లో సివిల్ సప్లయిస్ ఏఎస్‌వో రవి ఫిర్యాదు చేశారు. ఈ దాడుల్లో డిప్యూటీ తహసీల్దారు జూలియాభాయ్, వీఆర్వోలు గిరి, మాలకొండయ్య పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	113
స్కిన్ చికెన్	202
స్కిన్‌లెస్	226

కోడిగుడ్ల ధర (100): 430

నెలాఖరులోపు పన్నులు చెల్లిస్తే 5 శాతం రాయితీ

కావలి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కావలి పురపాలక సంఘంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, ఖాళీస్థలం పన్నులను పూర్తిగా ఒకేసారి ఈ నెలాఖరులోపు చెల్లిస్తే 5 శాతం రాయితీ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపుదారులు మీ దగ్గరలో ఉన్న మీసేవా కేంద్రంలో, సచివాలయాలలో, మున్సిపల్ కార్యాలయంలో పన్ను చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు

కందుకూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గ ప్రజలకు ప్రజాప్రతినిధులు, నేతలు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, తూమాటి మాధవరావు, మాజీమంత్రి మానుగుంట మహీధరరెడ్డి, వైసీసీ ఇంఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్, మాజీఎమ్మెల్యే దివి శివరాంలు వేర్వేరు ప్రకటనల్లో శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలి

● మాలకొండను సందర్శించిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని కందకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్యే నాగేశ్వరరావు శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ప్రధాన ఉప అర్చకుడు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు అనంతరం మహా అన్నదానం, లడ్డుప్రసాదం కౌంటర్, కేశఖండన శాలతో పాటు ఆలయంలో జరుగుతున్న పలు అబివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు నాణ్యమైన భోజనం పెట్టాలని, భక్తులకు అసౌకర్యం కలిగితే సహించేది లేదని తెలిపారు. ఆయన వెంట ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు కాకుమాని హర్ష, సోమినేని రవీంద్ర, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వీఎస్‌యూ ఫస్ట్ ర్యాంక్ విద్యార్థినికి అభినందన



షమితకు మిఠాయి తినిపించి అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఉమ, అధ్యాపకులు

కావలిటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) కావలి ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల బీఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థిని షమిత విక్రమసింహపురి యూనివర్సిటీలో ఫస్ట్ ర్యాంక్ సాధించింది. దీంతో శనివారం కళాశాలలో కరస్పాండెంట్ రాజ్‌కుమార్ చౌదరి, ప్రిన్సిపాల్ ఉమమహేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, ఏవో మధు, అధ్యాపకులు, సిబ్బంది షమితకు మిఠాయిలు తినిపించి అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వీఎస్‌యు విడుదల చేసిన డిగ్రీ పరీక్ష ఫలితాల్లో 10కి 10 జీపీఏ సాధించి యూనివర్శిటీ ఫస్ట్ ర్యాంక్ సాధించించడం గర్వకారణమన్నారు.

ఆక్రమణల చెరలో
డ్రైనేజీ కాలువలు!



అటవీశాఖ కార్యాలయ వీధిలో సీటీవో కార్యాలయం పక్కన కనుమరుగైన కాలువ

» అడిగే నాథుడు కరువు
» వర్షం పడితే రోడ్డుపైకి మురుగు
» పట్టణ ప్రజలకు తప్పని అవస్థలు

కావలిటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణ పరిధిలో డ్రైనేజీ కాలువలు ఆక్రమణలతో కుంచించుకుపోతున్నాయి. ఆ కాలువల్లో మున్సిపల్ పారిశుద్య కార్మికులు శుద్ధి చేసేందుకు ఏమాత్రం అవకాశం లేనంతంగా కనుమరుగవుతోన్నాయి. సరైన నిర్వహణకు నోచుకోకపోవడంతో ఉన్న సన్నపాటి కాలువలు చెత్తాచెదాలతో నిండిపోయి మురుగు నీరు ముందుకు ప్రవహించలేక నిల్వ చేరి దుర్గంధం వెదజల్లడంతోపాటు పందులకు ఆవాసాలుగా, దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతోన్నాయి. అయినా పట్టించుకునే నాథుడు లేకపోవడంతో వర్షం పడినప్పుడు కాలువల్లో మురుగుతో కలిసి వర్షం నీరంతా రోడ్డు మీదకు చేరుతోంది. దీంతో పట్టణ ప్రజలు అల్లాడుతోన్నారు. ట్రంకురోడ్డు దాటుతూ ఏఎం బేకరి పక్కనున్న దాదాపు 8 అడుగుల పెద్ద డ్రైనేజీ కాలువ ఆక్రమణకు గురై రెండు అడుగులకు కుంచించుకుపోయింది. ట్రంకురోడ్డు ముఖద్వారంలో ఇప్పటికీ 8 అడుగుల కాలువ స్థలం ఉన్నప్పటికీ పోయేకొద్ది అక్రమ నిర్మాణాలతో సన్నగా మారిపోయింది. ఆ కాలువ తిరిగి సీటీవో కార్యాలయం పక్క నుంచి అటవీ శాఖ కార్యాయం రోడ్డు కాలువలో కలిసి సమీపంలోని పాపిరెడ్డి చెరువు గుండా పోతోంది. అయితే కాలువ చివర్లో సీటీవో కార్యాల యం పక్కన 8 అడుగుల స్థలం ఇప్పటికీ అందుబాటులో ఉన్నప్పటికీ సన్నటి కాలువ నిర్మాణంలో ఉండడం వలన వర్షం పడినప్పు డు కాలువ సామర్థ్యం సరిపోక అటవీ కార్యాలయ రోడ్డు మురుగుమయంగా మారడం పరిపాటి అయింది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అందుబాటులో ఉన్న కాలువ స్థలమైన ఆక్రమణకు గురికాకముందే కాలువ వెడల్పు పెంచి నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను పంపించి కాలువ స్థితిగతులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.



ఏఎం బేకరి పక్కన ఆక్రమణకు గురైన కాలువ

ప్రజాస్వామ్యవాది జగ్జీవన్‌రామ్

● కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి



కావలి : బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, తదితరులు

కావలిటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బాబు జగ్జీవన్‌రామ్ సామాజిక యోధుడు, ప్రజాస్వామ్య వాది అని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కొనియాడారు. శనివారం భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని మాగుంట పార్వతమ్మ రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆర్డీవో సన్నీవంశీకృష్ణతో కలసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే ముసునూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ నాయకులతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంటరానితనం, ఆర్థిక సామాజిక అసమానతలు రూపుమాపేందుకు జగ్జీవన్‌రామ్ తన జీవితం అంకితం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, జ్యోతి బాబురావు, మొగిలి కల్లయ్య, కండ్లగుంట మధుబాబు నాయుడు, పొట్లూరి శ్రీనివాసులు, ఏగూరి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో చిత్రపటం ఉంచి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతలు కిరణ్, మంద వెంకటేశ్వర్లు, అక్కిలగుంట ఏసు, కత్తి శివయ్య, మహేష్, జానకి, ప్రసాద్ పాల్గొన్నారు.

● బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి ఎద్దు బ్రహ్మయ్య, నేతలు జ్ఞానశేఖర్, మణి, చక్కా రవి, బాలు తదితరులు బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

● బీజేపీ నేతలు భరత్‌కుమార్, అమరా సుబ్బారావు, బ్రహ్మానందం, మంద కిరణ్, పరుసు వెంకటేశ్వర్లు, మంద శ్రీనివాసులు తదితరులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● కావలి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎం.సన్నీ వంశీ కృష్ణ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్‌లు బాబు జగజ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరు : భారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు చర్చి సెంటర్‌లో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంతకుముందు స్థానిక టీడీపీ కార్యాలయంలోను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అట్టడుగువర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని, దేశానికి ఆయన చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, కంద్రా మాల్యాద్రి, రాయపాటి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, గోచిపాతల మోషే, బీజేపీ నాయకుడు గట్టమనేని హరిబాబు, ప్రజాసంఘాల నాయకులు గురిజాల బెంజిమెన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ నాయకులు కె.వీరారెడ్డి, బూసి సురేష్‌బాబు, వై. ఆనంద్‌మోహన్, షేక్ హుస్సేన్, బాలబ్రహ్మచారి, ఉప్పుటూరి మాధవరావు, కోటేశ్వరరావు తదితరులు జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు.

కావలి రూరల్ : స్వాతంత్ర్య సమరయోధుడిగా డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ ఎనలేని సేవలు అందించారని ఎమ్పీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు పీ.శ్రావణ్‌కుమార్, ఎమ్పీడీవో కార్యాలయంలో ఎమ్పీడీవో సీహెచ్.శ్రీదేవిలు జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా కార్యాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అల్లూరు : స్థానిక టీడీపీ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, కావలి కృష్ణ, నజీర్‌బాషా, ఇస్మాయిల్, వెంకయ్య, శీనయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక పాతబస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దళితులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్లు సాల్మన్‌రాజు, గాలి వేణుగోపాల్, దర్శిగుంట వాసు, యశ్వంత్ కుమార్, శ్రీనివాసులు, వికాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి : సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఎమ్మార్పీస్ దాని అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగసముద్రం : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ అని టీడీపీ నేత ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో టీడీపీ నేతలు అంగుళూరి చినకొండయ్య, మన్నేపల్లి నాగేశ్వరరావులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడపా నర్సయ్య, గొల్లపల్లి వెంకటేశ్వర్లు, భట్టరుశెట్టి రమణయ్య, దార్ల మధు, కిలారి మల్లికార్జున, మక్కెన మల్లికార్జున, సీహెచ్ శింగయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు ఎస్ సీతామహాలక్ష్మి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీటీ కే శ్రీనివాసులు, ఆర్ఐ రమణయ్య, వీఆర్‌వోలు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపురం : ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యసిబ్బంది బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉలవపాడు : ఉలవపాడులోని బస్టాప్ సెంటర్‌లో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు ఆర్ ఐజాక్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కరేడు గ్రామంలోని ఆయన విగ్రహానికి పంచాయతీ పారిశుధ్య కార్మికులు, ఎంఆర్‌పీఎస్ నాయులు గడ్డం నవీన్, పున్నెపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు.

బిట్రగుంట : బోగోలు మండలంలో వాడవాడలా జగ్జీవన్‌రామ్ జయింతి వేడుకలు జరిగాయి. చెంచులక్ష్మీపురం అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత, గిరిజన నాయకులు ఆంద్ర బుద్ధయ్య, బోగిరి యోహాను ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపట్టానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేతలు ఇజ్రయేల్, వెంకటేశ్వర్లు, రాధయ్య, మోషే, ప్రభాకర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయంలో కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, ఎల్.సుధీర్‌బాబు, మాధవరావు, పోతల శీనయ్య, రామోహన్‌రెడ్డి జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ అధ్యక్షుడు ఎస్ఎస్ యాదవ్, జీ.వెంకటేశ్వర్లు, నేతలు వెంకటకృష్ణ, మనోహర్, సూర్యం, రైల్వే పెన్షర్స్ అసోసియేషన్ సభ్యులు గోవిందురాజులు, రాజన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు

రాయితీతో రైతుకు భరోసా!

» వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు » అర్హుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
» మండలానికి 41 యంత్రాల మంజూరు



రోటోవేటర్‌తో దుక్కి చేస్తున్న రైతు

కొండాపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రైతుకు వ్యవసాయంలో చేయూత అందించేందుకు ప్రభుత్వం పలు రకాల పథకాలు ప్రవేశపెడుతోంది. అందులో భాగంగా వ్యవసాయంలో యాంత్రీకరణ పరికరాలు రాయితీపై అందించనుంది. మండలానికి 41 యంత్ర పరికరాలు మంజూరు అయ్యాయి. ఈ పథకాలు పొందేందుకు దరఖాస్తు చేసుకునే రైతులు సన్న, చిన్నకారు రైతులై ఐదు ఎకరాల లోపు పొలం కలిగి ఉండటంతో పాటు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు కలిగి ఉండాలి. గడచిన ఐదేళ్లలో ఎలాంటి సబ్సిడీలు పొంది ఉండరాదు. ఖరీఫ్, రబీ ఏదో ఒక సీజన్‌లో ఈక్రాప్ నమోదై ఉండాలి. ట్రాక్టరు పరికరాలు పొందాలంటే వాహనం యొక్క ఆర్సీ పత్రాలు దరఖాస్తుతో పొందుప రచాలి. వాహనం కుటుం బంలో వ్యక్తుల పేరుమీద ఉంటే రేషన్ కార్డులో నమోదై ఉండాలి. అన్ని అర్హతలతో కూడిన పత్రాలతో రైతులు రైతు సేవాకేంద్రాలకు వెళ్లిన ట్లయితే వ్యవసాయశాఖ అధికారులు ఆన్‌లైన్లో దరఖా స్తు చేసుకుంటారు. అనుమతి పొందిన రైతు రాయితీ పోను మిగిలిన నగదును వెంటనే చెల్లించాల్సి ఉంటుంది. మంజూరైన పరికరాలలో తైవాన్ స్ప్రేయర్లు 15లో జనరల్-12, ఎస్సీ-2, ఎస్టీ-1 కేటాయించారు. కల్టివేటర్లు 23లో జనరల్-17, ఎస్సీ-4, ఎస్టీ-2, 1 రోటోవేట రు ఎస్టీలకు, రెండు చార్జింగ్ స్ప్రేయర్లు జనరల్ విభాగానికి కేటాయించారు. అన్ని వర్గాల రైతులందరికీ రాయితీ ఒకే విధంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు తెలిపారు.

మండలానికి మంజూరైన రాయితీ పరికరాల వివరాలు

పరికరాలు	మంజూరైనవి	ధర	రాయితీ
తైవాన్ స్ప్రేయర్లు	15	రూ. 26,010	రూ.10,000
కల్టివేటర్లు	23	రూ.43,350	రూ.21,675
చార్జింగ్ స్ప్రేయర్లు	2	రూ 4,480	రూ.1,000
రోటోవేటర్లు	1	రూ 1,46,000	రూ.46,000

12 మంది దరఖాస్తు

ఇప్పటి వరకు 12మంది రైతులు కల్టివేటర్లు, తదితర పరికరాలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కొందరు రైతులు మాత్రమే రాయితీకి సంబంధించిన నగదు చెల్లించారు. మరికొందరు రైతులు చెల్లించాల్సి ఉంది. పరికరాలు కావాల్సిన రైతులు స్థానిక రైతు సేవాకేంద్రాల్లోని వీఏలను సంప్రదించాలి.

\- షేక్ సైదా, వ్యవసాయాధికారి, కొండాపురం

శ్రీరామనవమి ఉత్సవాల ప్రారంభం



శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా భీమవరప్పాడులో భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కొండాపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడవళ్లూరు, భీమవర ప్పాడు తదితర గ్రామాల్లోని రామాలయాల్లో శనివారం శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు ఆలయాలకు తరలివచ్చి పూజలు నిర్వహించారు. భీమవరప్పాడులో ఐదు రోజులు జరిగే ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు గరుడసేవ జరుగుతుంది. అందుకోసం శనివారం సీతరాముల విగ్రహాలకు అభిషేకాలతోపాటు గరుత్మంతుని ఆరాధన, హనుమాన్ చాలీసా పారాయణ, మన్య సూక్తంతో అంజనేయస్వామి అభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారి తీర్ధ ప్రసాదాలను భక్తులకు అందచేశారు. ఉభయకర్తలు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కావలి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్‌కు స్థానిక యూనియన్ నాయకులతో కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుద్య కార్మికులపై కక్ష్య సాధింపులకు పాల్పడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరణించిన, పదవీ విరమణ చెందిన వారి స్థానాల్లో వారి కుటుంబ సభ్యులతో భర్తీ చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలన్నారు. 2005 నుంచి 2019 వరకు కార్మికుల పీఎఫ్‌ను ఆప్కాస్ వారి పీఎఫ్ అకౌంట్‌లో కలపాలన్నారు. రోజువారి కార్మికులను అవుట్‌సోర్సింగ్‌లోకి తీసుకోవాలని, కార్మికుల సంఖ్యను పెంచాలని, చనిపోయిన, పదవీవిరమణ చేసిన కార్మికుల పీఎఫ్‌ను క్లియర్‌చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లె అంకయ్య, నేతలు టీ.వెంకటేష్, వై.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రాళ్లపాడు రోడ్డు

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గుంతలు పడి, కంకర లేచి అధ్వానంగా ఉన్న రాళ్లపాడు పంచాయతీరాజ్ రోడ్డు

లింగసముద్రం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపేట రోడ్డు నుంచి రాళ్లపాడు గ్రామానికి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 15 ఏళ్ల క్రితం మెటల్ రోడ్డుగా ఉన్న ఈ రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేశారు. అయితే గత ఐదారేళ్ల నుంచి ఈ రోడ్డుపై ఉన్న తారు, మెటల్ లేచిపోయి గుంతలు పడి ప్రయాణానికి నరకప్రాయంగా మారింది. ముఖ్యంగా వర్షాలు కురిసిన సమయంలో ఈ రోడ్డు క్రమేణా దెబ్బతింటూ వస్తోంది. దీంతో ఒక కిలోమీటరు పొడవు ఉన్న ఈ రోడ్డుపై అడుగడుగున గుంతలు ఏర్పడి దారుణంగా మారింది. అయినా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు సరికదా కనీసం ఒక గుంకైనా తట్టడు మట్టి వేసిన పాపాన పోలేదు. దీంతో కొత్తపేట-శాయిపేట రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు గ్రామస్థులకు ఈ రోడ్డే ఆధారం. ఈ రోడ్డుపై ప్రతినిత్యం ఆటోలు, మోటారు సైకిళ్లు, బస్సులు వెళుతుంటాయి. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

కిలో పొగాకు రూ.280

కలిగిరి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 454 పొగాకు బేళ్ల విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో ఎనిమిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 331 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-92, ఆర్‌ఆర్-5, సీఆర్-17, జంపింగ్‌లాట్స్-9 తదితర కారణాలతో 123 బేళ్లు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.230, సగటు ధర రూ.262.52 నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమణయ్య

కావలి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కావలి శాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు యూనియన్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా డీవీ రమణయ్య, కార్యదర్శిగా ఎన్.రామకృష్ణ, కోశాధికారిగా పీ.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా జీ. వంశీ, ఉపకార్యదర్శిగా మనోహర్‌నాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

గ్యాస్ సిలిండర్లు ఏమవుతున్నాయి?

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం శ్రీరామపురంలో వంట గ్యాస్ సిలిండర్లు మాయమవుతున్న ఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. దుండగులు రాత్రులు ఇల్లు, టిఫన్ దుకాణాల్లోకి ప్రవేశించి సిలిండర్లను అపహరించుకుపోతున్నారని స్థానికులు అంటున్నారు. స్థానిక పోలీసులు గ్యాస్‌సిలిండర్ దొంగలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు అప్రజాస్వామికం

బిట్రగుంట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు అప్రజాస్వామికం అని ముస్లిం మైనార్టీ నేతలు షేక్.నూరుద్దీన్, జహీర్ అన్నారు. బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని సీపీఎం కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ముస్లింలు అభ్యంతరాలు తెలుపుతూ ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా కేంద్రం కక్ష పూరితంగా ఆమోదించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు తుమ్మల వెంకయ్య, సీఐటీయూ కార్యదర్శి చల్లా నరహరి, అన్వర్‌బాషా, రామయ్య, అహ్మద్‌బాషా, నిజాముద్దీన్, నవీద్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

9న మున్సిపల్ గదులు, హోర్డింగ్‌లకు బహిరంగ వేలం

కందుకూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీగా ఉన్న గదుల లీజుకు, పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రచార హోర్డింగ్‌ల లీజుకు కేటాయించేందుకు ఈనెల 9వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కె.అనూష ఒక ప్రకటనలో తెలిపారు. పాత లారీస్టాండ్ ఆవరణలో నిర్మించి ఉన్న మున్సిపాలిటీ గదులలో షాప్ నెం 1, 13, 15లకు, వెంకట నారాయణ బజారులోని కేకేఆర్ కాంప్లెక్స్‌లో షాప్ నెం 6కు, ముత్యాలకుంట పార్కువద్ద గల షాపునకు బహిరంగ వేలం జరుగుతుందని, ఆసక్తి కలిగిన వ్యాపారులు పాల్గొనాలని పేర్కొన్నారు. ప్రచార హోర్డింగ్‌లకు కూడా ఏడాది హక్కు కోసం నిర్వహిస్తున్న బహిరంగ వేలంలో పాల్గొనదలచినవారు రూ.50వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చునని తెలిపారు.

మూడో రోజూ విడుదల కాని నీరు

లింగసముద్రం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు-రేళ్లపాడు మంచినీటి పథకం నుంచి శనివారం మూడో రోజు కూడా నీటి సరఫరా జరగలేదు. గురువారం ఈ పథకంకు చెందిన సంపులు శభ్రం చేసేందుకు అధికారులు, సిబ్బంది నీటి సరఫరాను నిలుపుదల చేశారు. అయితే పెంట్రాలలోని ఫిల్టర్ పాయింట్ వద్ద ఉన్న సంపులలోని వాల్వ్‌లు కూడా మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వాటిని కూడా బాగు చేయించేందుకు అధికారులు మెకానిక్‌ల వద్ద ఇచ్చినట్టు చెప్పారు. వీటిని ఫిల్టర్ పాయింట్ వద్ద బిగించి ఆదివారం ఉదయం నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. మూడు రోజుల పాటు ఈ మంచినీటి పథకం నుంచి నీటి సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తాగునీటి సరఫరా నిలిపివేత

వలేటివారిపాలెం : లింగసముద్రం మండలంలోని మొగిలిచర్ల వద్ద ఉన్న చుండి చెర్లోపాలెం రక్షిత తాగనీటి పథకం మోటారు మరమ్మతులకు గురికావడంతో మండలంలోని మాలకొండ, అయ్యవారిపల్లె, పోలినేనిచెరువు, గరుకుపాలెం, చుండి, పెద్దఅమ్మపాలెం, తదితర గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిపివేసినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శిరీషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి : కలెక్టర్



నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ ఎస్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్టు కలెక్టర్ ఓ. ఆనంద్ చెప్పారు. మాజీ ఉపప్రధాని బాబు జగజ్జీవన్‌రామ్ జయంతిని శని వారం సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యం లో కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమా లవేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలూ కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ అని పేర్కొన్నారు. జిల్లాలో పదివేల మంది గిరిజనులకు ఆధార్ కార్డులు లేవని, వారందరికీ ఆధార్ కార్డులు ఇప్పించి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య శాలువా కప్పి సత్కరించారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు స్వర్ణావెంకయ్య ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు విజయకుమార్‌లతోపాటు పలు సంఘాల నాయకులు జగజ్జీవన్‌రామ్ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో జేసీ కే. కార్తీక్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

14న ఎస్టీ వర్గీకరణ భేరీ

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 14న నెల్లూరులో ఎస్టీ వర్గీకరణ భేరీ నిర్వహించనున్నట్లు యానా దుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య తెలిపారు. శనివారం నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఆయన విలేక రులతో మాట్లా డారు. ఆ రోజు నగరంలోని వెన్నెల కంటి రాఘవయ్య భవన్ నుంచి వీఆర్సీ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం టౌన్ హాల్లో రాష్ట్రస్థాయి సభ నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఎస్టీల వర్గీకరణకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. యానాది గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్య క్షుడు చేవూరు సుబ్బారావు మాట్లాడుతూ ఎస్టీ వర్గీకరణ భేరీకి తామంతా సంఘీభావం తెలుపుతు న్నామని చెప్పారు. సమావేశంలో వర్గీకరణ భేరీ గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నేతలు రాపూరు కృష్ణయ్య, మానికల మురళి, చెంబేటి ఉష, కల్లూరు వరలక్ష్మి, తిరివీధి సతీష్ చంద్ర, కల్లూరు పెంచలప్రసాద్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి జిల్లా స్థాయి క్యారమ్స్ పోటీలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నెల్లూరుక్లబ్‌లో ఈనెల 12 నుంచి 14 వరకు జిల్లాస్థాయి ర్యాంకింగ్ క్యారమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ కార్యదర్శి వీ. రఘురామ్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈనెల 10న సాయంత్రం 5 గంటలలోపు క్లబ్‌లోని అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీమన్నారాయణను, తనను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే నెల్లూరు క్లబ్ సభ్యులకు ప్రత్యేకంగా క్యారమ్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

జింకను చంపిన వ్యక్తి అరెస్ట్



క్రిష్టయ్యను అరెస్ట్ చూపుతున్న డీఎఫ్‌వో మహబూబ్‌బాషా, రేంజర్ మాల్యాద్రి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : అడవుల్లో తిరిగే జింకను చంపి మాంసం తింటున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్‌బాషా తెలిపారు. నగరంలోని నిప్పో కూడలి వద్ద గల జిల్లా అట వీశాఖ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మా ట్లాడారు. వెంకటాచలం మండలం వెంకటకృష్ణాపురంలో నివాసం ఉంటున్న చల్లాకిష్టయ్య నెల్లూరు రేంజ్ పరిధిలోని ఆమంచర్ల సెక్షన్ కసుమూరు రిజర్వు ఫారెస్ట్‌లో జింకను చంపి మాంసం తింటున్న సమయంలో ఆయన్ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972 కింద అరెస్ట్ చేసి రిమాండ్ పంపామన్నారు. వన్యప్రాణులను చంపితే కఠిన శిక్షలు పడతాయని డీఎఫ్‌వో హెచ్చరించారు. సమావేశంలో నెల్లూరు రేంజర్ మాల్యాద్రి,సెక్షన్ అధికారి పాల్గొన్నారు.

రూపాయి బొండా... కడుపునిండా!

ధర తక్కువైనా రుచి శుచిలో నో కాంప్రమైజ్



రూపాయికి ఏం వస్తుంది. ఓ అగ్గిపెట్టె, ఓ చాక్లెట్.. ఇంతకుమించి ఏమీ రావు. కానీ నెల్లూరు నగరంలో ఆ ప్రాంతానికి వెళితే మాత్రం ఒక్క రూపాయికే బోండాలు లభిస్తాయి. వేడివేడి బోండాలతో పాటు వడలు, బజ్జీలూ అందుబాటులో ఉంటాయి. అయ్యప్పగుడి సమీపంలోని వెంకటరెడ్డినగర్ రామాలయం వీధిలో ప్రతిరోజూ సాయంత్రం ఒక్క రూపాయి బోండాలు విక్రయిస్తుండటంతో ఆహార ప్రియులు క్యూ కడుతున్నారు.

నగరంలోని వెంకటరెడ్డి నగర్ రామాలయం పక్కనే రేగల విజయలక్ష్మి మూడేళ్లకుపైగా తన ఇంటిముందే ఒక్క రూపాయి బోండాలను విక్రయిస్తోంది. ఈమె కుటుంబ సభ్యులు మరో నలుగురు మహిళలు కూడా కస్టమర్లకు టిఫిన్ అందించడంలో బిజీగా ఉంటారు. ఇక్కడ బోండాలు తినేకొద్దీ మరిన్ని తిందామా అన్నంత రుచిగా ఉంటాయి. టిఫిన్‌తో పాటు అందించే వేరుశనగ చట్నీ, కారం, వివిధ రకాల పొడులు ఇక్కడ ప్రత్యేకం. ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు కూడా కస్టమర్లతో బిజీగా ఉండే ఈ ప్రాంతం బోండాల సువాసనతో నిండిపోయి ఉంటుంది. అలాగే ఇదే రామాలయంవీధి చివరిలో కనకట్ల స్వాతి కూడా రూపాయి బోండాలు విక్రయిస్తుండటంతో సమీపంలోని ఆటోనగర్ కార్మికులు, స్థానికులు వీటిని ఆస్వాదిస్తున్నారు. అలాగే, బ్యాంక్ ఆఫ్ ఇండియా వీధి చివరలో గుద్దేటి మహాలక్ష్మమ్మ కూడా ఒక రూపాయికే బోండాలు విక్రయిస్తున్నారు. బోండాలు తినే వారితోపాటు పెద్ద ఎత్తున పార్శిల్స్ కూడా తీసుకెళుతుంటారు. ఏమీ కొనేటట్లు లేదు.. ఏమీ తినేటట్లు లేదంటూ ధరలు పెరిగిపోతున్న ఈరోజుల్లో రూపాయికే రుచికర బోండాలను అందిస్తున్న వీరిని కస్టమర్లు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



సంతాన వృద్ధి కోసం పుత్రకామేష్టి యాగం



కొలువుదీరిన సీతారామచంద్రమూర్తి, శ్రీదేవిభూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, విఘ్నేశ్వరుడు



యాగస్థలిలో కొలువు తీరిన కన్యకాపరమేశ్వరి

భారీగా తరలివచ్చిన దంపతులు

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు బాలాజీ నగర్‌లోని సీతారామ మందిరంలో శనివారం పుత్రకా మేష్టియాగాన్ని వైభవంగా నిర్వహించారు. పిల్లలు లేని దంపతులు సంతాన వృద్ధి కోసం ఈ యాగంలో పాల్గొన్నారు. మాచవోలు కోటేశ్వరశర్మ, ఆయన కుమారులు ఆధ్వర్యంలో పుత్రకామేష్టి, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. తొలుత ఆలయంలోని సీతారామచంద్ర మూర్తులు, కల్యాణ వేంకటేశ్వరస్వామి, వినాయక స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి.



పుత్రకామేష్టియాగం చేస్తున్న మాచవోలు కోటేశ్వరరావు, తదితరులు

కోశాధికారి కొప్పవరపు శివప్రసాద్, ఉపాధ్యక్షుడు వాకాటి నరసయ్య తదితరులు పర్యవేక్షించారు. యాగానికి ఉభయకర్తలు, అమర్త లూరు శ్రీనివాసులుగుప్తా, కరుణమ్మ, వెంకటేశ్వర్లు గుప్తా, గీతాంజలి, సురేంద్రనాథ్ గుప్తా, అన్నపూర్ణ, డాక్టర్ భారతి, డాక్టర్ విష్ణుతేజ, డాక్టర్ పీ. చిన్మయి వ్యవహరించారు.

● భక్తుల అనుభవాలు

కాగా 2023లో జరిగిన పుత్రకామేష్టి యాగంలో పాల్గొని సంతానం పొందిన విజయవాడకు చెందిన వెంకటనాగమణి నిధిర, ఆత్మకూరుకు చెందిన కే. స్వాతి, నగరానికి చెందిన రజనీ యాగ ఫలం అనుభవాలను భక్తులతో పంచుకున్నారు.

ఈ కార్యక్రమాలను ఉత్సవ కమిటీ చైర్మన్ అమరా మోహన్‌రావు, మందిరం కమిటీ అధ్యక్షుడు తన్నీరు మస్తాన్‌రావు, గౌరవాధ్యక్షుడు తాతా వెంకట కిషోర్‌కుమార్, గౌరవ సలహాదారు ఎంపీ ఆంజనేయులు, కార్యదర్శి సోమిరెడ్డి వెంకట రత్నం,



యాగంలో పాల్గొన్న దంపతులు

ఆ ఆలయాలను ఎండోమెంట్‌లో కలపొద్దు

● ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి అర్చకుల మొర ● అవి ఎప్పుడో కలిశాయి : ధర్మకర్త

కావలి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని కలుగోళ్లశాంభవి, పాతూరు శివాలయం, విష్ణాలయంలను ఎండోమెంట్‌లో కలిపితే తమ ఉపాధి పోతుందని, ఈ ఆలయాలను దేవాదాయశాఖ పరిధిలోకి తేవద్దని ఆ మూడు ఆలయాల ప్రధాన అర్చకులు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం కావలిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేని కలిసి ఆ మూడు ఆలయాలను ఎప్పటి లాగనే కొనసాగించేలా చూడాలని కోరారు. అయితే స్పందించిన ఎమ్మెల్యే ఇది తన పరిధిలో లేదని, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాక తానేమీ చేయలేనని స్పష్టం చేశారు. అయితే ఆలయ అర్చకులుగా మీరే కొనసాగేలా చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది. మీరు వద్దంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాల్సి వస్తోందని అన్నట్లు తెలిసింది. కాగా ఈ మూడు ఆలయాలు ఎండోమెంట్‌లో ఎప్పుడో కలిసాయని, ఇప్పుడు పాలనా సౌలభ్యం కోసం కొండబిట్రగుంట ఆలయ ఈవో రాధాకృష్ణకు నిర్వహణల బాధ్యతలు అప్పగించారని ఈ మూడు ఆలయాల ధర్మకర్త కృష్ణమోహన్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. తాను వ్యవస్థాపక ధర్మకర్తగా ఆలయ ఈవోకు ఆలయాల నిర్వహణకు సహకరిస్తానని చెప్పారు. ఆలయాల్లో ఎప్పటిలాగే పూజా కార్యక్రమాలు, ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు.

రైలులో చోరీ కేసులో ముగ్గురిని గుర్తించాం..

● దొంగతనాలకు పాల్పడింది ఆరుగురిగా అనుమానం
● త్వరలోనే నిందితుల అరెస్టు ? ● గుంతకల్ రైల్వే ఎస్పీ రాహుల్ మీనా

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరు రోడ్డు సమీపంలో రైల్లో జరిగిన చోరీలో కేసులో ముగ్గురు నిందితులను గుర్తించామని, త్వరలోనే వారిని అరెస్ట్ చేస్తామని గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. శనివారం ఆయన జిల్లాలో పర్యటించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రోడ్డు మార్గం గుండా ఆయన అల్లూరు రోడ్డు సమీపంలో రైలులో చోరీ జరిగిన ప్రాంతానికి చేరుకున్నారు. దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. అధికారులనడిగి వివరాలు తెలుసుకున్నారు. అక్కడ నుంచి అల్లూరు రోడ్డు స్టేషన్ వద్దకు చేరుకొని పరిశీలించారు. అనంతరం పడుగుపాడు రైల్వే స్టేషన్‌కు చేరుకొని పరిశీలించారు. సాయంత్రం నగరంలోని పోలీసు గెస్ట్‌హౌస్‌కు మీనా చేరుకున్నారు. రాత్రి రైల్వే డిఎస్పీ కార్యాలయానికి చేరుకొని అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ రైల్లో జరిగిన చోరీలో ఆరుగురు ఉన్నట్లు అనుమానిస్తున్నామ న్నారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో ముగ్గురు నిందితులను గుర్తించామని, త్వరలోనే వారిని అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక టీమ్‌లు గాలిస్తున్నాయన్నారు. చోరీ కేసును త్వరితగతిన ఛేదించాలని డీజీపీ ప్రత్యేకంగా చెప్పారని, త్వరలోనే ఛేస్తామన్నారు. సమావేశంలో రైల్వే డీఎస్పీ మురళీధర్, ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఎస్ఐలు పాల్గొన్నారు.

● సిగ్నల్ ప్రాంతం తనిఖీ

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి) : బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని అల్లూరు రోడ్డు రైల్వే స్టేషన్ ఉత్తర హోం సిగ్నల్ ప్రాంతాన్ని గుంతకల్ జీఆర్పీ ఎస్పీ రాహుల్ మీనా శనివారం తనిఖీ చేశారు. ఈనెల 2న రాత్రి అల్లూరు రోడ్డు రైల్వే స్టేషన్ వద్ద మధురై ఎక్స్‌ప్రెస్‌లో దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. ఈ విషయమై రైల్వే అధికారులు విచారణను వేగవంతం చేశారు. అందులో భాగంగా గుంతకల్ రైల్వే ఎస్పీ రాహుల్ మీనా ఒంగోలులో శాఖ అధికారులతో ముందుగా సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం రైల్వే డీఎస్పీ మురళీధర్, సీఐ సుధాకర్‌లను వెంట పెట్టుకుని అల్లూరురోడ్డులోని హోం సిగ్నల్, ట్యాంపర్ ప్రాంతాన్ని పరిశీలించారు.

నృసింహుడి సన్నిధి.. భక్తుల దోపిడీ ఇది!

టెంకాయ రూ.100, పూలమాల రూ.300 ● మూడొంతుల అధిక ధరతో విక్రయం

మాలకొండలో భక్తుల నిలువు దోపిడీ

అన్నీ తెలిసినా పట్టించుకోని అధికారులు

మాలకొండ. ఇదో పవిత్ర పుణ్య క్షేత్రం. వారంలో ఒకరోజు మాత్రమే ఇక్కడ ఆలయ ప్రవేశం ఉంటుంది. ఆ ఒక్క రోజే ఎక్కడెక్కడి నుంచో వేలాదిమంది భక్తులు తరలివచ్చి లక్ష్మీనృసింహ స్వామి వారిని దర్శించుకుంటారు. ఇలా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వ్యాపారుల తీరుతో బెంబేలెత్తిపోతున్నారు. స్వామి వారికి కొబ్బరాయ కొట్టి, పూల మాల సమర్పించి మొక్కు తీర్చుకోవాలం టేనే హడలిపోతున్నారు. ఎక్కడా లేని విధంగా పూజా సామగ్రి ధరలు ఆకాశా న్నంటుతూ సామాన్య భక్తులకు అందనంత ఎత్తుకు పెంచేశారు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)



మాలకొండలోని కొబ్బరికాయల దుకాణం

రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం ఒకటి. ఈ దేవాలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి ప్రతి శనివారం 10 వేల మందికిపైగానే భక్తులు వస్తుంటారు. భక్తులు ఆలయంలోకి అడుగుపెట్టిన దగ్గర నుంచి తిరిగి వెళ్లే వరకు ప్రతి చోట నిలువు దోపిడీకి గురవుతున్నారు. తొలుత టోల్‌గేట్ నుంచి ప్రారంభమయ్యే ఈ బాదుడు పుణ్యక్షేత్ర ప్రాంగణంలో నిర్వహిస్తున్న దుకాణాల వరకు అన్నింటిలోనూ అధిక ధరలు వసూలు చేస్తున్నారు. దుకాణదారులు ఇష్టం వచ్చిన ధరతో పూజా సామగ్రి విక్రయిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఈ శనివారం భక్తులను బెంబేలెత్తించేలా ధరలు ముడొంతులు పెంచేశారు. కొబ్బరికాయ రూ.100, పూలమాల రూ.300 లకు విక్రయించారు. ఈ ధరలు చూసి భక్తులు ఖంగుతిన్నారు. గత వారంలో కొబ్బరికాయ, అరటిపండు, పూలు, పసుపు, కుంకుమ, సాంబ్రాణి కడ్డీలతో కలిపి రూ 50, పూలమాల సైజును బట్టి రూ.150 నుంచి 200లకు విక్రయించారు. అలాంటిది ఈ వారం వీటి ధర అమాంతం పెరగడంతో భక్తులు ఆందోళన చెందారు. వీటి ధరలు ఇలా ఉంటే స్వామి, అమ్మవారికి సమర్పించే చీర, జాకెట్, పూలు, పండ్లు, నిమ్మకాయలు గాజులు, పసుపు, కుంకుమ, అగర బత్తీలు తదితర పూజా ద్రవ్యాలకు ఇంకెంత దోచుకొంటారోనని బహిరంగంగా చర్చించుకోవడం విశేషం. వారం రోజుల వ్యవధిలోనే పూజాద్రవ్యాలకు మూడొంతులు రేట్లు పెరిగాయా, ఈ రేట్లు ఎక్కడా లేవంటూ పలువురు భక్తులు ఆలయ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమని భక్తులు వాపోయారు. ఎవరైనా భక్తులు ఈ ధరల గురించి ప్రశ్నిస్తే అధిక ధరలు పెట్టి పాటలు పాడుకున్నామంటూ వారితో వాగ్వావానికి దిగుతున్నట్లు భక్తులు చెబుతున్నారు. వాస్తవానికి ఆలయ టెండర్ల నిబంధనల ప్రకారం 12 అంగుళాల చుట్టుకొలత కలిగిన కొబ్బరి కాయ రూ.30లకు విక్రయించాలి. అయితే దుకాణదారులు మూడొంతులు పెంచి విక్రయిస్తున్నారు. అయితే, దుకాణం ఎదుట తాటికాయంత అక్షరాలతో టెంకాయ రూ.30 అని ధరల పట్టిక పెట్టి ఉండడం కొసమెరుపు.

మాలకొండ ఆదాయం రూ.11,16,458

వలేటవారిపాలెం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.11,16,458 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు ఒక ప్రకట నలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ.5,950, కుంకుమార్చనకు రూ.17,440, తల నీలాలు సమర్పణకు రూ.42,400, వాహన పూజలకు రూ.3,320, ప్రత్యేక దర్శనానికి రూ.3,37,300, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ.640, రూము అద్దెలు రూ.32,700, కవర్లు విక్రయంతో రూ.9600, లడ్డుప్రసాదానికి రూ.1,90,030, అన్నదానం ద్వారా రూ.4,66,962, విరాళములు రూ.10,116 ఆదాయం లభించినట్లు సాగర్‌బాబు తెలిపారు.

ఎక్కువ ధరకు అమ్మారు!



నేను ప్రతి శనివారం మాలకొండకు వస్తాను. గతంలో టెంకాయ, పూల మాల, అరటి పండు నిమ్మకాయ, సాంబ్రాణి కడ్డీలు, పసుపు, కుంకుమ, తదితర పూజాద్రవ్యాలు కలిపి రూ.200 తీసుకున్నారు. ఇప్పుడు రూ.400 తీసుకున్నారు.

- చెన్నయ్య, పొన్నలూరు

టెంకాయ వందా!?



టెంకాయ రూ.100 అమ్ముతున్నారు. ఇదేంది దుకాణం ముందు పెట్టిన ధరల పట్టికలో రూ.30 అని ఉంది కదా.. మీరు వంద అమ్మడమేమిటని అడగితే మేము అమ్మేది ఇంతేనని నిర్లక్ష్యంగా చెప్పారు.

- ఝాన్సీ, పెదపవని

కొండ కింద టెంకాయ ముప్పయ్యే..



మా కుటుంబ సభ్యులు కొండకింద కొబ్బరికాయ రూ.30 లకే కొనుగోలు చేశారు. కొండపైన ఉన్నాయి కదా అని నేను పైకొచ్చాను. ఇక్కడేమో రూ.100 తీసుకున్నారు. అదేంది కొండ కింద రూ.30 అంటే అక్కడికే వెళ్లి తెచ్చుకోమన్నారు.

- శేషాచలం, పెదపవని

విచారించి చర్యలు తీసుకుంటా



టెంకాయ రూ.100 అమ్ముతున్నట్లు భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ఆలయ నిబంధనల ప్రకారం టెంకాయ రూ.30లకే విక్రయించాలి. దీనిపై విచారించి వాస్తవమైతే చర్యలు తీసుకుంటాం.

- సాగర్‌బాబు, డిప్యూటీ కమిషనర్, మాలకొండ

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోర్టులో కులం పేరుతో దూషిస్తూ దాడికి యత్నించారని, ఓ న్యాయవాది ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు శనివారం ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, న్యాయవాది హరిబాబు బార్ అసోషియేషన్‌లో 18 ఏళ్లుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ నెల 4న ఆయన క్లయింట్‌కు సంబంధించిన ఎన్‌వోసీ విషయంపై న్యాయవాది ఎం. లక్ష్మి, ఆమె భర్త కలిసి హరిబాబును తక్కువ కులానికి చెందిన వాడివని దూషిస్తూ, దాడికి యత్నించారు. అంతటితో ఆగకుండా న్యాయవాది లక్ష్మి కాలికి ఉన్న చెప్పు తీసి హరి బాబుపైకి విసిరింది. ఆమె భర్త బాధి తుడి కాలర్ పట్టుకొని 'నీ అంతు చూస్తా'.. అంటూ దాడి చేశాడు. అక్కడే ఉన్న న్యాయవాదులు అడ్డు కొని ఇరువురిని పక్కకు లాగారు. ఈ మేరకు బాధితుడు చిన్నబజారు పోలీ సులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి

వెంకటాచలం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాకుటూరు గ్రామానికి చెందిన కొత్త తన్మయ్ (13) గ్రామ సమీపంలోని కొత్త చె రువులో ఈతకు వెళ్లాడు. చెరువులో భారీ గ్రావెల్ గుంతలు ఉండడంతో లోతు తెలియక తన్మయ్ మునిగిపోయాడు. మిగిలిన ఇద్దరు స్నేహితులు రక్షించడానికి ప్రయత్నాలు చేసిన ఫలించలేదు. బాలుర కేకలు విని స్థానికులు వచ్చి చెరువులో గాలించారు. కొద్దిసేపటికి గుర్తించి బయటకు అప్పటికే మృతి చెందాడు. బాలుడి మృతిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు. తన్మయ్ చెముడుగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు.

జగనన్న కాలనీల అవినీతిపై చర్య తీసుకోవాలి

వెంకటాచలం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని జగనన్న కాలనీలో జరిగిన భారీ అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు డిమాండు చేశారు. ఈ విషయంపై శనివారం ఆయన మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి ఆనవాళ్లకు జగనన్న కాలనీలే నిదర్శనం అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రావెల్‌ను దోచుకొని ప్రజా సంపదను కొల్లగొట్టారన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8559
వెండి కిలో ధర	రూ. 90,800
వెండి ఒక గ్రాము	రూ.93.80

న్యూస్ బాక్స్

అనుమతులు తప్పనిసరి

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):శ్రీరామనవమి వేడుకలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ వీరేంద్ర బాబు తెలిపారు. ఈవిషయంపై శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు.వే డుకల్లో అశ్లీలనృత్యాలు ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివాదాస్పద గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.

రీ సర్వేపై అవగాహన

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోడూరు బిట్-1, 2గ్రామాల్లో రీ సర్వేపై తహసీల్దారు కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. కోడూరులో రెవెన్యూ అధికారులు సర్వేయర్ సమక్షంలో రీసర్వేపై లాభాలను వివరించి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సర్వేయర్ అహ్మద్ బాషా, రీ సర్వే డీటీ గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం,ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని ఆటో కార్మిక సంఘం సంఘం జిల్లా అధ్యక్షుడు కోలగట్ల రమేష్ డిమాండ్ చేశారు. శనివారం బుచ్చిలో మండల కమిటీ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు మొదట గ్రామంలో పర్యటించారు. అనంతరం ఆటో కార్మిక సంఘం సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లికార్జున, జానీభాష, ఆటో కార్మిక నాయకులు రాధయ్య, రమేష్ పాల్గొన్నారు.

రెండు లారీల ఢీ

డ్రైవర్లు, క్లీనర్లకు స్వల్పగాయాలు

కోవూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడుగుపాడు సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం రెండు లారీలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో లారీలు రెండు స్వల్పంగా దెబ్బతినడంతో పాటు డ్రైవర్లు, క్లీనర్లు స్వల్పంగా గాయపడ్డారు. కరేడు నుంచి నెల్లూరుకు కోడిగుడ్ల లోడుతో బయలుదేరిన లారీ పడుగుపాడు ప్రాంతానికి చేరుకున్న సమయంలో ఓ టైరుకు పంక్చరై అదుపుతప్పింది. ఇది గమనించని కావలి నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీ వచ్చి దాన్ని ఢీకొన్నది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి ఈ మేరకు కేసు నమోదు చేశారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు

మైపాడులో మహిళల ఆందోళన

ఇందుకూరుపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మైపాడులో బీసీ కాలనీలో సిమెంటు రోడ్డు నిర్మాణం పనులు జరుగుతుండగా కొంతమంది అభివృద్ధిని చూసి ఓర్వలేక నిర్మాణాలను అడ్డుకునే చర్యలు తీసుకుంటున్నారని శనివారం స్థానిక మహిళలు నిరసన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మైపాడులో సిమెంటు రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే పనికట్టుకుని మరి ఆటంకాలు కలుగజేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతుంటే అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శ్లాబు పెచ్చులూడి.. గోడలు బీటలు వారి..

● శిథిలావస్థలో విడవలూరు తహసీల్దారు కార్యాలయం



తహసీల్దారు కార్యాలయం భవనం దుస్థితి



పెచ్చులు ఊడుతున్న భవనం పైకప్పు

విడవలూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):మండల తహసీల్దారు కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. 60ఏళ్ల కిందట నిర్మించిన భవనం కావడంతో పెచ్చులూడుతుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అధికారులు, కార్యాలయాలకు వచ్చే జనాలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మండలాధికారులు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా సమస్యను పరిష్కరించ డం లేదు.

● కనీసం మరమ్మతులు చేపట్టలేదు..

తహసీల్దారు కార్యాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు గురై ఏడాది కావస్తోంది. అయితే భవన మరమ్మతులకు నిధులు కేటాయించక పోవటంతో భవన గోడలు బీటలు వాలి, పిల్లర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. శ్లాబు పైకప్పు పెచ్చులూడి పోతున్నాయి. తీరప్రాంత మండలం కావడంతో తుఫాను, భారీ వర్షాలు వచ్చినపుడు తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని తుపాను హెచ్చరిక కేంద్రంలో 24గంటలు రెవెన్యూ అధికారులు విధులను నిర్వర్తించాల్సి వస్తుంది. అలాంటి సమయంలో వర్షపునీరు భవనంలోని పైకప్పు నుంచి నీరు ఒడుస్తుంటే అధికారులు విధులు నిర్వర్తించడం కష్టంగా మారింది. భవనం లో 8గదులుండగా తహసీల్దారు గది మినహా అన్ని గదులు వర్షానికి ఉరుస్తాయి. అలాగే కార్యాలయంలో సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందుల మధ్య విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో తహసీల్దారు కార్యాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు.

● ఉన్నతాధికారులకు తెలిపాం

పాతభవనంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. వారినుంచి అనుమతులొచ్చి నిధులు మంజూరైతే నూతన భవన నిర్మాణానికి అవసరమైన తీసుకుంటాం.

- చంద్రశేఖర్, తహసీల్దారు

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి

● ఘనంగా జయంతి వేడుకలు

● పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు, అధికారులు, స్వచ్ఛంద, ప్రజా సంఘాల సభ్యులు



కోవూరులో..



ఇందుకూరు పేట: నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది



వెంకటాచలం: నివాళులర్పిస్తున్న విద్యార్థులు



పొదలకూరు: వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కోవూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధానమంత్రి జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి, ఇందుపూరు మురళీ కృష్ణారెడ్డి, ఇంటూరి విజయ్‌కు మార్, గొర్రిపాటి నరసింహ ఉన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేద్కర్ భవన్‌లో జరిగిన వేడుకలో ఎంఆర్‌పీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు, దర్శిగుంట శీనయ్య, వీరప్రసాద్, కాసా శ్రీనివాసులు, కళ్యాణ్, చప్పిడి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. అలాగే తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు పెద్ద పోస్టాఫీసులో వేడుకలు నిర్వహించారు.

● ఇందుకూరుపేట (ఆంధ్రజ్యోతి):జగదేవిపేట ఆరోగ్య కేంద్రంలో జరిగిన వేడుకలో ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ కిషోర్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● రాపూరు, (ఆంధ్రజ్యోతి):సిద్దవరంలో భీమ్ సేవా ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో చిన్నారులకు పలకలు, నోట్ బుక్స్, పెన్నులు, చాక్లెట్స్ పంచిపెట్టారు. కార్యక్రమంలో భీమ్ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పల్లి చిరంజీవి, కుంచం వేమయ్య, అరుణమ్మ, అరీఫా, దూడల పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాచలం (ఆంధ్రజ్యోతి):విక్రమసింహపురి యూనివర్సిటీలో జరిగిన వేడుకలో వర్సిటీ ప్రొఫెసర్ విజయానంద్‌కుమార్ బాబు, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త అల్లం ఉదయ్ శంకర్, డాక్టర్ అనిల్‌కుమార్ ఉన్నారు.

● మనుబోలు, (ఆంధ్రజ్యోతి):తహసీల్దార్, మండల కార్యాలయాల వేడుకలో తహసీల్దార్ సీహెచ్, సుబ్బయ్య, ఎంపీడీవో జలజాక్షి, ఈవోఆర్‌డీ నారాయణ పాల్గొన్నారు.

● పొదలకూరు (ఆంధ్రజ్యోతి): బాబు జగజ్జీవన్‌రాం జయంతి వేడుకలు ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల కార్యాలయాల్లో జరిగాయి. కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంటు సెక్రటరీ అలుపూరు శ్రీనివాసులు, సూరిపాక ఉదయ్‌కృష్ణ, కలువాయి శ్రీను, బుజ్జయ్య, కొంగి వెంకట రమణయ్య, మస్తానయ్య, అరుణమ్మ, గంటా మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.



రాపూరు: పిల్లలకు నోట్ బుక్స్, పలకలు అందజేస్తున్న డాక్టర్ చిరంజీవి



మనుబోలు: నివాళులర్పిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

శ్రీరామనవమి వేడుకలకు సర్వం సిద్ధం

మనుబోలు, ఏప్రిల్ 5: గ్రామాల్లోని రామ మందిరాలు, కోదండరామస్వామి ఆలయాల్లో ఆదివారం జరుగనున్న శ్రీరామనవమి వేడుకలకు నిర్వాహకులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆలయాలను శుభ్రపరచడం, రంగులు వేసి అందంగా తీర్చిదిద్దడం, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి శోభాయమానంగా తయారు చేశారు. ఆలయాల వద్ద పందిర్లు వేయడం, అర టి పిలకలు, మామిడి తోరణాలు కట్టారు. వేడుకలతో సందడి వాతావరణం నెలకొంది.

● పొదలకూరు (ఆంధ్రజ్యోతి):స్థానిక లక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం 6.30గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పెండ్యాల రమణయ్య నాయుడు, విజయలక్ష్మీ తెలిపారు. అలాగే ఉదయం 7గంటలకు స్వామి వారి అష్టోత్తరాలు, భక్తులకు వడపప్పు, పానకం ప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఉభయకర్తలుగా కర్రియావుల సురేష్, మంజుల దంపతులు వ్యవహరిస్తారు. కళ్యాణ అనంతరం అన్నదానం ఉంటుందన్నారు.

● వెంకటాచలం (ఆంధ్రజ్యోతి):కసుమూరు పం చాయతీలోని శ్రీరామపురంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరుగనుంది. వేడుకలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు దంపతులతో పాటు కుటుంబసభ్యులు హాజరుకానున్నారు.

● కోవూరు, (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామస్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ పనులను ఆలయ నిర్వాహకులు కాటంరెడ్డి కృష్ణారెడ్డి పర్యవేక్షించారు. ఆదివారం ఆలయ పూజారి శ్రీకాంతాచార్యులు ఆలయంలో పూలంగి, పల్లకీసేవ నిర్వహించనున్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి):పెద్దూరు సీతా, లక్ష్మణ సమేత కోదండరాముడి ఆలయ ఉత్సవాలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. రాజగోపురం విద్యుద్దీపాలతో అలంకరించారు.

● రాపూరు, (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో స్వామి వారి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున అభిషేక కార్యక్రమాల అనంతరం ఉత్సవ మూర్తులను నిత్యకల్యాణ మండపంలో ఏర్పాటుచేసి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి తిరుచ్చి పల్లకిసేవ, ఊంజల్ సేవ జరిపారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు కోనమాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. రానున్న వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాటుకు షీల్డ్ టెండర్లు నిర్వహించినట్లు ఆలయ ఈవో పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.



రాపూరు : కోనలో కల్యాణం జరుపుతున్న అర్చకులు

ఘనంగా జాతీయ మారిటైమ్ దినోత్సవం



వేడుకలో పాల్గొన్న పోర్టు ఉద్యోగులు, తదితరులు

ముత్తుకూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అదానీ కృష్ణపట్నం పోర్టులో శనివారం 62వ జాతీయ మారిటైం దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టు ప్రతినిధులు మాట్లాడారు. దేశంలో సంపన్నమైన సముద్ర రంగం, నీలి ఆర్థిక వ్యవస్థ, హరిత వృద్ధి అభివృద్ధిలో యువత పాత్రను హైలెట్ చేస్తుందన్నారు. అనంతరం పోర్టు ఉద్యోగులతో కలిసి కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పోర్టు లిమిటెడ్ ఉద్యోగులు, కార్మికులు, ఇండియన్ కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసు, కస్టమ్స్, షిప్ మాస్టర్స్ వెస్సెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

తాగుబోతుల వీరంగం

పొదలకూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌రోడ్డులోని ఓ వైన్స్ షాపు ప్రాంగణంలో ఓ యువకుడుపై తాగుబోతులు దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనలో యువకుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎస్‌ఐ హనీఫ్ దాడికి పాల్పడ్డ తాగుబోతులను అదుపులోకి తీసుకున్నారు. తీవ్ర గాయాలతో ఉన్న యువకుడిని పొదలకూరు ప్రభుత్వాసుపత్రిలో తరలించారు. దాడికి పాల్పడ్డ యువకులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రతి సమస్యనూ పరిష్కరించాల్సిందే!

● అధికారులకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదేశం ● బుచ్చి కాలనీల్లో పర్యటన



సమస్యలను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి విన్నవిస్తున్న ప్రజలు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):మనం పర్యటించిన ప్రతిచోట ప్రజలు మన దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాల్సిందేనని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే బుచ్చి నగర పంచాయతీలోని 5, 6,7 వార్డుల్లోని కామాక్షికాలనీ నుంచి పర్యటనతో ఆయా ప్రాంతాలు పరిశీలించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా వార్డుల్లో తిరగి తెలుసుకున్నారు. 15 ఏళ్లగా ప్రజల ప్రధాన సమస్య గుడపల్లికాలువే అన్నారు. స్పందించిన వారు నిధులు మంజూరు చేసి సమస్యను పరిష్కరిస్తామని హామీఇచ్చారు. రేషన్ స రుకులకోసం సుదూర ప్రాంతం వెళ్లాల్సిన పరిస్థితి ఉందని చెప్పడంతో 4 కొత్త రేషన్ దుకాణాల ఏర్పాటుకు ఆదేశించారు. కామాక్షికాలనీలో స్మార్ట్‌మీటర్ ఏర్పాటుతో గత నెలలో 4వేలకు బదులు రూ.34వేలు బిల్లు వచ్చిందని షేక్ సుల్తాన్ అనే వ్యక్తి ఎమ్మెల్యే ముందు ఏకరవు పెట్టాడు. ఎమ్మె ల్యే విద్యుత్ అధికారులతో మాటాడి పరిష్కరించి ఆ మీటర్లపై ప్రజలకు అవగాహన కల్పించాల న్నారు. అలాగే గత ప్రభుత్వంలో తమకు పిం చన్లు, ఇళ్లు, స్థలాలు, రేషన్‌కార్డులు తొలగించా రని తెలిపారు. దోబీఘా ట్ ఆక్రమణ, డ్రెయినేజీ సమస్యలను విని పరిష్కరిస్తామని హామీ ఇచ్చా రు. అంతకుముందు డాక్టర్ జగ్జీవన్‌రాం జయం తి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళి, వైస్ ఛైర్మన్లు శివకుమార్ రెడ్డి, నస్రీన్‌ఖాన్, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, మాజీ ఎంపీటీసీ పర్వీన్, శివ, నాయకులు హరికృష్ణ, శేషయ్య, షబ్బీర్, రామానాయుడు, మల్లారెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన జొన్నలగడ్డ సునీతమ్మకు సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన రూ.4.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే బాధితురాలికి ఎమ్మెల్యే నివాసంలో అందజేశారు.

ఎమ్మెల్యేను కలిసిన షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు

నెల్లూరు(హరనాథపురం,ఆంధ్రజ్యోతి): కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు శనివారం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని నెల్లూరులోని ఆమె నివాసంలో కలిశారు. బకాయిలు చెల్లింపులు జరిగేలా కృషి చేసిన ఆమె కృతజ్ఞతలు తెలిపారు. 13 ఏళ్లుగా తాముచేస్తున్న పోరాటం ప్రశాంతిరెడ్డి కృషితో ఫలించిందన్నారు. ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ కోవూరు షుగర్ ఫ్యాక్టరీకి చెందిన 124 ఎకరాల భూమిని ఏపీఐఐసీకి అప్పగించి ఇండస్ట్రీయల్ హబ్‌గా మారుస్తామన్నారు. కార్యక్రమంలో షుగర్ ఫ్యాక్టరీ సంఘం నేతలు నారాయణ, ఎంవీ రమణ, శివ, మస్తాన్, పెన్నాడెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ఆర్టీసీ బస్సు, సిమెంట్ ట్యాంకర్ ఢీ

● 11 మందికి గాయాలు



క్షతగాత్రులకు వైద్య సేవలు చేస్తున్న వైద్య సిబ్బంది

సంగం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు - సిమెంట్ ట్యాంకర్ ఢీకొని 11 మందికి గాయాలైన సంఘటన సంగం - ముంబాయి జాతీయ రహదారి కూడలిలో శనివారం ఉదయం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నెల్లూరు నుంచి పామూరుకు వెళ్తూ మార్గమధ్యంలో సంగం బస్టాండ్‌లోకి వెళ్లింది. అనంతరం బస్సు కలిగిరి రహదారిలోకి వెళ్లేందుకు సంగం-ముంబాయి జాతీయ రహదారి కూడలి దాటుతుండగా నెల్లూరు నుంచి కడప వైపు వేగంగా వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ బస్సును మధ్యలో ఢీకొంది. దీంతో బస్సులో 31 మంది ప్రయాణికులు ఉండగా అందులో 11 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సంగం ఎస్‌ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో సంగం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం క్షతగ్రాతుల్లో కొందరిని ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు, మరికొందరిని నెల్లూరుకు తరలించారు. బస్సును పక్కకు తీసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

రాపూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలం పులిగిలపాడు వద్ద శనివారం సాయంత్రం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. జోరేపల్లి గ్రామానికి చెందిన వల్లూరు జగదీష్ బైక్‌పై రాపూరుకు వస్తుండగా ఎదు రుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయ పడిన జగదీష్‌ను చికిత్స కోసం గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

దర్గాలో సలాం విషయంలో వివాదం

● ఎస్‌ఐ చొరవతో సమస్య పరిష్కారం

ఏఎస్ పేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఖాజా నాయబ్ రసూల్ దర్గాలో ప్రతిరోజు రాత్రి జరిగే సలాం విషయంలో సజ్జదా హఫీజ్ పాషాకు దర్గా ఈవో హంసేన్‌కు మధ్య శుక్రవారం రాత్రి వివాదం జరగడంతో ఉద్రిక్తత నెలకొంది. వివరాల మేరకు కోర్టు ఉత్తర్వుల ప్రకారం సజ్జదా హఫీజ్ పాషా దర్గాలో ప్రార్థనలు, సలాంలు చేసుకోవచ్చు, అతను లేని సమయంలో ఇమామ్ సలాం చేస్తారు. అలాకాకుండా శుక్రవారం రాత్రి హఫీజ్‌పాషాకు సంబంధించిన ఇతర వ్యక్తులు సలాం చదవడానికి ప్రయత్నించడంతో దర్గా ఈవో హంసేన్ అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగి గొడవకు దారితీసింది. దీంతో హఫీజ్‌పాషా తమ హక్కులను అడ్డుకుంటున్నారని దర్గా ముందు బైఠాయించి నిరసనకు దిగడంతో దర్గాలో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుకున్న ఎస్‌ఐ సైదులు తన సిబ్బందితో కలసి దర్గాకు విచ్చేసి ఇరువురితో చర్చించి సమస్యను పరిష్కరించడంతో సజ్జదా హఫీజ్ పాషానే సలాం చదివారు.

కుమార్తె ఆచూకీ తెలపాలని డీఎస్పీ కార్యాలయం ఎదుట తల్లి ఆందోళన

ఏఎస్ పేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కుమార్తె ఆచూకీ తెలపాలని కోరుతూ ఆత్మకూరు డీఎస్పీ కార్యాలయం ముందు ఓ తల్లి గ్రా మస్థులతో కలిసి శనివారం ఆందోళన చేపట్టింది. వివరాల మేరకు.. రాజవోలు గ్రామానికి చెందిన హబీబా కుమార్తె ఆత్మకూరు ఏఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో చదువుతోంది. ఈనేపథ్యంలో సుమారు నెల రోజుల క్రితం ఆమె ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఏఎస్ పేట పోలీస్‌స్టేషన్‌లో హబీబా ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి కుమార్తె ఆచూకీ కోసం పోలీసుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని, దీంతో ఆత్మకూరు డీఎస్పీకి మొర పెట్టుకునేందుకు వచ్చినట్లు బాధితురాలు, గ్రామస్థులు తెలిపారు. కాగా, డీఎస్పీ లేకపోవడంతో సీఐ గంగాధర్ ప్రత్యేక బృందాలతో గాలింపు చేపడతామని హామీ ఇవ్వడంతో వారు వెనుతిరిగారు.

మహిళ పర్సులో నగదు మాయం

● పోలీసులకు ఫిర్యాదు




బస్టాండ్ ప్రాంతంలో విచారణ జరుపుతున్న ఎస్‌ఐ

ఉదయగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్ర జ్యోతి): బంగారం కొనేందుకు వచ్చిన ఓ మహిళ పర్సులో నగదు మాయమైన సంఘటన శనివారం ఉదయగిరిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు.. మండలం లోని మాసాయిపేట గ్రామానికి చెందిన పిడతల తిరుపతమ్మ బేల్దారి కూలి పనులు చేసుకుంటూ రూ.30 వేలు కూడబెట్టింది. ఆ నగదుతో బంగారు చెవి కమ్మలు కొనేందుకు మరో ఇద్దరి మహిళ లతో కలిసి ఆటోలో ఉదయగిరికి వచ్చింది. అనంతరం బంగారం దుకాణానికి వెళ్లి చూడగా పర్సు మాత్రమే ఉంది. అందులో ఉంచి న నగదు కనిపించలేదు. దీంతో నగదు ఎక్కడ జారిపోయిందని ఆటో దిగిన దగ్గర నుంచి బంగారం దుకాణం వరకు గాలింపు చేప ట్టింది. అయినా కనిపించపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో కలిసి బస్టాండ్‌కు చేరు కుని విచారణ చేసి, గాలింపు చేపట్టినా ఫలితంలేదు. చేసేదేమీ లేక కష్టార్జితం పరులపాలైందని తిరుపతమ్మ నిరాశగా వెనుతిరిగింది.

రైస్‌మిల్లుపై అధికారుల దాడులు

● 184.25 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

జలదంకి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జలదంకిలోని ఎల్‌ఆర్ అగ్రహారం రోడ్డులో ఉన్న గోకుల కృష్ణ రైసుమిల్లుపై శనివారం పౌర సర ఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు స ంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 184.25 క్వింటాళ్ల రేషన్ బియ్యంను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ బియ్యాన్ని కావలి ఎంఎస్ఎస్ పాయింట్‌కు తరలించారు. రైస్‌మిల్లు యజమానిపై 6ఎ కేసుతో పాటు నమోదు చేశారు. అలాగేఅతనిపై జలదంకి పోలీసుస్టేషన్‌లో సివిల్ సప్లయిస్ ఏఎస్‌వో రవి ఫిర్యాదు చేశారు. ఈ దాడుల్లో డిప్యూటీ తహసీల్దారు జూలియాబాయ్, వీఆర్వోలు గిరి, మాలకొండయ్య పాల్గొన్నారు.

కాకాణీ... ఎక్కడ దాక్కున్నావ్ ?

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : 'కాకాణీ.. ఏ గూట్లో దాక్కున్నావ్.. కేసులకు అదరనన్నావ్ .. అరెస్టులకు బెదరనన్నావ్.. ఇప్పుడే మైపోయావ్'.. అంటూ టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరు రాధాకృష్ణమనాయుడు ప్రశ్నించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. అక్రమ మైనింగ్‌లో వందల కోట్లు దోచుకున్న కాకాణి ఫలితం అనుభవించక తప్పదని హెచ్చరించారు. వరదాపురం గిరిజనుల శాపాలు తప్పక వెంటాడుతాయని పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, కనుపూరు కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వర్ధినేని మస్తాన్‌నాయుడు, పొన్నూరు రామకృష్ణయ్య పాల్గొన్నారు.

తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరు



మాట్లాడుతున్న రాధాకృష్ణమనాయుడు తదితరులు

న్యూస్ బాక్స్

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ పీ.శివరాం ప్రసాద్ అన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ కార్యదర్శి మురళీకృష్ణ, కోశాధికారి సత్యనారాయణ, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి రవిచంద్ర, కోశాధికారి గోపీనాథ్, నేతలు రాఘవేంద్రషెట్టి, సుబ్బరాజు పాల్గొన్నారు.

టిడ్కో గృహ సముదాయంలో స్వచ్ఛభారత్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వేంకటేశ్వరపురం టిడ్కో గృహ సముదాయం వద్ద శనివారం జనసేన సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుందరరామిరెడ్డి, గునుకుల కిషోర్, పవన్, మధు పాల్గొన్నారు.

'వక్ఫ్ బిల్లులో బోలెడన్ని లొసుగులు'

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సవరణ బిల్లులో బోలెడన్ని లొసుగులు ఉన్నాయని భారత రాజ్యాంగ పరిరక్షణ జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ ఆరోపించారు. శనివారం జర్నలిస్టు భవన్‌లో ఆయన మాట్లాడుతూ ఈ కొత్త బిల్లులో బోలెడన్ని లొసుగులు, మోసాలు ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని పునఃసమీక్షించాలన్నారు. సమావేశంలో సయ్యద్ నవీన్ అహ్మద్, సయ్యద్ షకీల్ అహ్మద్, షేక్.అబ్దుల్ కరీం, జాకీర్, అన్వర్ బేగ్, అబ్దుల్ గని, సర్దార్ పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఉన్న సత్యసాయి సదన్‌లో శనివారం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేదలకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ బాధ్యులు సత్యనారాయణ సురేష్‌కుమార్, వేలూరు రంగారావు, బలరామయ్యనాయుడు, రాఘవేంద్ర ప్రసాద్, సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **ఉచిత వైద్య పరీక్షలు**

నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడామైదానంలో శనివారం వాకర్స్‌కు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కిలారి వెంకటస్వామినాయుడు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అసోసియేషన్ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నేతలు పోబోలు సత్యం, సురేష్, రఘురామనాయుడు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసకుమార్, కిలారి తిరుపతినాయుడు పాల్గొన్నారు.

గొలుసు దొంగల అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన ఇద్దరు నిందితులను బాలాజీ నగర్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు, బాలాజీ నగర్ 13వ వీధిలో అనురాధ నివాసం ఉంటున్నారు. గత నెల 31న రాత్రి ఆమె ఇంటి సమీపంలో నడుచుకుంటూ వెళ తుండగా మెడలోని 48 గ్రాముల బంగారు సరుడును ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సాంబశివరావు నేతృత్వంలో ఎస్ఐ విజయశ్రీనివాస్ సాంకేతికత ఆధారంగా నిందితులు డైకాస్ రోడ్డుకు చెందిన సింహాద్రి, విజయ బాబులుగా గుర్తించారు. వారి కోసం గాలింపు చేపట్టారు. శనివారం నిందితులను ఎన్టీఆర్ నగర్ పెట్రోల్ బంకు సమీపంలో అరెస్ట్ చేసి, చోరీ సొత్తును, నేరానికి ఉపయోగించిన బైకును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన అధికారులు, సిబ్బందిని నగర డీఎస్పీ సింధుప్రియ అభినందించారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని వృద్ధురాలి అదృశ్యంపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు, టైలర్స్ కాలనీలో పురుషోత్తం కుటుంబం నివాసం ఉంటున్నది. ఆయన తల్లి సుబ్బ మ్మ మూడేళ్లగా మతిస్థిమితం సరిగా లేక బాధపడుతోంది. ఈనెల 2న ఆమె ఇంటి నుంచి అదృశ్యమైంది. బాధిత కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో పురు షోత్తం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.







జడ్పీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ,సిబ్బంది. టీడీపీ కార్యాలయంలో కోటంరెడ్డి, అబ్దుల్ అజీజ్, తదితరులు నివాళి, నుడా కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న చైర్మన్, సిబ్బంది

జగ్జీవన్‌రామ్‌కు ఘననివాళులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జీ. కృష్ణకాంత్ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ త్యాగాలకు గుర్తుగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లలో ఆయన్ను స్మరించుకున్నామన్నారు.

● జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో జరిగిన జగజ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఎక్సైజ్ డీసీ టీ. శ్రీనివాసరావు, ఏసీ శ్రీనివాసనాయుడు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

● జనసేన జిల్లా నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో నగరంలోని జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుందరరామిరెడ్డి, జమీర్, ఖరీం, పవన్, తదితరులు పాల్గొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, ఇతర నాయకులు ప్రశాంత్‌గౌడ్, హేమ చంద్ర యాదవ్, శరవణ, తదితరులు కూడా ఆయనకు నివాళులు అర్పించారు. జనసేన 8 డివిజన్ ఇన్‌చార్జి గుర్రం కిషోర్ ఆధ్వర్యంలో తడికల బజారు సెంటర్‌లో జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కడింపాటి మస్తాన్, నాని, ప్రవీణ్, నాగేంద్ర పాల్గొన్నారు.



బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : బాబు జగ్జీవన్‌రామ్ జయంతికి సెలవు ప్రకటించటం కూటమి ప్రభుత్వానికే సాధ్యమయిందని వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నేతలు నివాళులర్పించారు. అనంతరం అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి, జెన్నీ రమణయ్య, కాకి ప్రసాద్, మాతంగి కృష్ణ, కువ్వారపు బాలాజీ, మీదూరి ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 5



ఎక్సైజ్ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

(ఆంధ్రజ్యోతి): నుడా కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నుడా కార్యదర్శి పెంచలరెడ్డి, ఏవో రాజు, సీపీవో హిమబిందు పాల్గొన్నారు.

● **అంటరానితనం నిర్మూలనకు కృషి**

సమాజంలో అంటరానితనం నిర్మూలనకు జగ్జీవన్‌రామ్ ఎనలేని కృషి చేశారని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతిని జడ్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఆమె పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

● నెల్లూరు(విద్య), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జగ్జీవన్‌రామ్ అందరికీ ఆదర్శనీయులని పలువురు వక్తలు తెలిపారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం నగరంలోని దర్గామిట్ట ఎంసియూపీ నగరపాలక పాఠశాలలో బీటీఏ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు ఎన్.రమణయ్య, చిట్టేటి రమేష్, పల్లం వేణుగోపాల్, ఆదినారాయణ, బీ.మాల్యాద్రి, కార్యదర్శి రఘు, నేతలు పాల్గొన్నారు.

● అలాగే నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాల యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భం గా శనివారం నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, నవకోటేశ్వరరావు, వీవీ.శేషులు, చలపతిశర్మ, నేతలు పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వై.అశోక్‌బాబు డిమాండ్ చేశారు. నగరంలోని ఎస్‌టీయూ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతన సవరణ కమిటీ సమయం రెండేళ్లు పూర్తవుతున్నా నేటికీ కమిటీ వేయకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ముందుగా ఐఆర్ ప్రకటన చేయడంతో పాటు పెండింగ్ డీఏలు, ఆర్థిక బకాయిలను చెల్లించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయ ఉద్యమకారులు వీణా విజయరామరాజు 25వ వర్ధంతిని నిర్వహించి, ఆయనతో బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కే.నరసింహం, పీ.సుమన్, జీ.రాజమనోహర్, జీ.వెంకటేశ్వర్లు, జీ.మాధవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాడవాడలా శ్రీరామనవమి

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పప్పులవీధి మహాలక్ష్మి ఆలయంలో ఆదివారం ఉదయం 9గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఈవో హేమచంద్రరావు తెలిపారు.

● ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండ రామస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం శ్రీనామనవమి వేడుకలు ప్రారంభమవుతాయని ఈవో దర్గయ్య తెలిపారు.

● గాంధీనగర్ షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం నుంచి మంగళవారం వరకు శ్రీరామనవమి వేడుకలు జరుగుతాయని మందిరం చైర్మన్ మన్నెం అమరనాథ్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు.

● బాలాజీనగర్ సాయిదర్బార్‌లో ఆదివారం ఉదయం అభిషేకాలు, సీతారామ కల్యాణం, అన్నప్రసాద వితరణ జరుగుతాయని మందిరం చైర్మన్ మధుసాయి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం బాబా రథోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో జెనెక్స్‌కి ఉత్తమ ఫలితాలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూ విడుదల చేసిన డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో జెనెక్స్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ వెంగల్‌రెడ్డి, డైరెక్టర్ కొండలరావు తెలిపారు. నగరంలోని కళాశాల ప్రాంగణంలో శనివారం జరిగిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బీఎస్సీలో ఎస్.ఉమామహేశ్వరి ప్రథమస్థానం సాధించగా, బీబీఏలో డీ.శివపార్వతి, పీ.లిఖితలు, బీసీఏలో టి.హేమశ్రీ, నసిపాత బుస్సంలు ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారన్నారు. అలాగే బీకామ్‌లో కే.జాహ్నవి, ఎస్‌కె.షాను, బీ.మాధవి మొదటి మూడుస్థానాలను సొంతంచేసుకున్నారన్నారు. వీరితో పాటు మరో 123 మంది విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీన్ వెంకట్, ప్రిన్సిపాల్ అనిల్, అడ్మిన్ ప్రిన్సిపాల్ ఏసురత్నం, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **ప్రాంగణ ఎంపికలు**

పార్థసారథి నగర్‌లోని జెనెక్స్ బీ స్కూల్‌లో శనివారం క్యాంపస్ ఎంపికలు నిర్వహించారు. 75 మంది పాల్గొనగా 38 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను చైర్మన్ వెంగల్‌రెడ్డి, డైరెక్టర్ కొండలరావు అభినందించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ తేజ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్, ప్లేస్‌మెంట్ హెడ్ చరణ్‌తేజ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాల స్థాయి నుంచి

డీమ్డ్ స్థాయి వరకు 'ఆదిశంకర'

గూడూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాల స్థాయి నుంచి డీమ్డ్ యూనివర్సిటీ స్థాయి వరకు ఆదిశంకర విద్యాసంస్థలు ఎదిగాయని ఆదిశంకర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య అన్నారు. స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో సిల్వర్‌జూబ్లీ వేడుకలు శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు కొనసాగాయి. ఈ కార్యక్రమానికి మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, తమిళనాడు మంత్రి రాజకన్నప్పన్, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, మాజీ మంత్రి పరసారత్నం తదితరులు హాజరయ్యారు. వేడుకల ముగింపు కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ 25 ఏళ్ల తమ విద్యాసంస్థల ప్రస్థానంలో వేలాదిమంది విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించామన్నారు. ఎంతో మంది తమ కళాశాలలో చదివిన విద్యార్థులు నేడు దేశ, విదేశాలలోని వివిధ బహుళజాతి కంపెనీలలో ఉన్నతస్థానాల్లో ఉండడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. జబర్దస్త్ టీమ్, వందేమాతరం శ్రీనివాస్ గేయాలు, విద్యార్థుల డాన్స్‌లు అలరించాయన్నారు. అనంతరం చైర్మన్ కుటుంబసభ్యులైన వంకి ప్రసూన, వంకి అరవింద, వంకి అనూష, వంకి ఐశ్వర్యలు అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో రాజామురుగదాస్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కొల్లు రవీంద్రతో వంకి పెంచలయ్య కుటుంబసభ్యులు

గ్రూప్-2లో శ్రీరాజు విద్యార్థుల విజయం



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ రాజు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఏపీపీఎస్సీ గ్రూప్-2 ఫలితాల్లో నగరంలోని శ్రీరాజు ఐఏఎస్ స్టడీసర్కిల్ విద్యార్థులు విజయం సాధించారని డైరెక్టర్ కేపీ. రాజు తెలిపారు. శనివారం సాయంత్రం స్టడీసర్కిల్ జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ సంస్థలో శిక్షణ పొందిన విద్యార్థుల్లో పీ. నాగేంద్రబాబు, టీవీ.సాయి కుమార్, ఎం.కుసుమలు 200కు పైగా మార్కులు సాధించి గెజిటెడ్ ఆఫీసర్లుగా ఎన్నికయ్యారన్నారు. ఉత్తమ శిక్షణతో ఇది సాధ్యమైందని, విద్యార్థులందరూ కూడా పట్టుదలతో సాధన చేస్తే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో స్టడీసర్కిల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని నగరంలోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతిచెందారు. ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు, ఈనెల 2న ఉదయం మూలాపేట వేదసంస్కృతి పాఠశాల వద్ద గుర్తుతెలియని వ్యక్తి(70)ని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అతను మృతిచెందాడు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు మతి స్థిమితం లేకుండా బట్వాడిపాలెంలో తిరుగుతుంటాడని, పేరు బాలరాజు అని చెబుతుంటాడని స్థానికులు పేర్కొన్నాడు.

సీతారామ కల్యాణోత్సవాల ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వేదాయపాలెం త్యాగరాజస్వామి ఆలయంలో శనివారం సీతారామ కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 11వతేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయి. సీతా జయంతి సందర్భంగా శనివారం సాయంత్రం దేవీ నవావరణ, లలితా సహస్రనామ పారాయణం జరిగాయి.ఆదివారం ఉదయం తిరుమంజనం, అనంతరం సీతారాముల కల్యాణం, సోమవారం ఉదయం తిరుమంజనం, రాత్రి శేషవాహన సేవ, మంగళవారం రాత్రి హనుమంతసేవ, బుధవారం రాత్రి గరుడ సేవ, గురువారం రాత్రి తిరుచ్చిసేవ, శుక్రవారం రాత్రి ఏకాంతసేవ నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్తలు యనమంద్ర చైతన్యకుమార్, వైష్ణవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● **సత్యసాయి మందిరంలో..**

నగరంలోని రామమూర్తినగర్ సత్యసాయిబాబా మందిరంలో ఆదివారం శ్రీరామనవమి పూజలు, నగర సంకీర్తన, సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు మందిర కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి సార్!

నెల్లూరు (స్టోన్ హౌస్‌పేట), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డిని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) నాయకులు కోరారు. శనివారం నెల్లూ రులోని ఆయన నివాసంలో వారు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జోనల్ కార్యదర్శి కే. లుక్సన్, జిల్లా కార్యదర్శి టీ. మురళీమోహన్‌రెడ్డి ఉద్యోగులు సమస్యలను ఆయనకు వివరించారు. సురేష్‌రెడ్డి స్పందిస్తూ ఎండీ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



సురేష్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

'మౌంట్ లిటారా'లో గ్రాడ్యుయేషన్ వేడుకలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మౌంట్ లిటారా గ్రూప్ ఆఫ్ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, నృత్యప్రదర్శనలు, ఆలపించిన శ్లోకాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్ ధనరాజ్, అకడమిక్ కోఆర్డినేటర్ దినేష్, ప్రిన్సిపాల్ రూపశ్రీ, సిబ్బంది ప్రభ, మంజుల పాల్గొన్నారు.



సుప్రజా రామా...

సకల గుణాలను కలిగిన ఉత్తమ పుణ్య పురుషుడు, లోక హితమే అభిమతంగా పాలన సాగించిన జగదభిరాముడి కల్యాణం ఆదివారం కమనీయంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ధర్మపరిరక్షణకు ప్రతీక అయిన రఘునాథుడు నేటికీ కలియుగ వైకుంఠం తిరుమలలో ప్రత్యేక పూజలందుకుంటున్నారు. శ్రీరామనవమి సందర్భంగా గురువారం ఆస్థానం నిర్వహిస్తున్న తరుణాన ప్రత్యేక కథనం.

- 6లో



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 6 ఏప్రిల్ 2025

డీడ్ ఇస్తేనే బాండ్లు

- టీడీఆర్‌లకు గిఫ్ట్ డీడ్‌లు ఇవ్వాల్సిందే
- అప్పుడు అడ్డగోలుగా ఇవ్వడం వల్లే ఇప్పుడీ తిప్పలు
- రెండో రోజు మేళాలో 67 మందికి ఆన్‌లైన్
- వీటిలో 48కి గ్రీన్ సిగ్నల్ ● నేడు మేళాతోపాటు ఫీల్డ్ విజిట్

తిరుపతి, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి) : 'డీడ్ ఈజ్ నీడ్.' టీడీఆర్ బాండ్ల కోసం వస్తున్న బాధితులకు అధికారుల నుంచి ఎక్కువగా వినిపిస్తున్న సమాధానమిది. టీడీఆర్ బాండ్ల దరఖాస్తుల ధ్రువీకరణ స్పెషల్ డ్రైవ్ రెండో రోజు శనివారమూ కొనసాగింది. సెలవు దినమైనప్పటికీ పెద్దఎత్తున కార్పొరేషన్ కార్యాలయానికి టీడీఆర్ బాధితులు రావడం కనిపించింది. మాస్టర్ ప్లాన్ రోడ్లకోసం ఆస్తులు పోయినవాళ్లు నగరపాలక సంస్థకు గిఫ్ట్ డీడ్ ఇచ్చివుండాలని, ఇవ్వనివారు ఇప్పుడైనా ఇస్తే ఆన్‌లైన్ లాగిన్ చేస్తామని చెప్పడంతో తొలుత నిరుత్సాహపడ్డారు. తర్వాత గిఫ్ట్ డీడ్‌లకు అంగీకరించారు. గతంలో గిఫ్ట్ డీడ్‌లు ఇవ్వనివారికి కూడా టీడీఆర్ బాండ్లు ఇచ్చారని పలువురు అధికారుల ముందు ప్రస్తావించారు. అప్పుడు అడ్డగోలుగా ఇవ్వడం వలనే ఇప్పుడీ తిప్పలు తప్పడం లేదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రెండో రోజు స్పెషల్ డ్రైవ్‌కు వచ్చిన 67మందికి ఆన్‌లైన్లో లాగిన్ చేశారు. వీటిలో 48 దరఖాస్తులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. టౌన్‌ప్లానింగ్ లాగిన్‌లో వీటిని పొందుపరిచారు. వీటికి త్వరలోనే టీడీఆర్ బాండ్లు జారీ చేయనున్నారు. ఆదివారం సెలవు దినం కూడా టీడీఆర్ బాండ్ల స్పెషల్ డ్రైవ్‌ను పెద్దఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రెండు బృందాలను ఏర్పాటు చేయనున్నారు. దరఖాస్తుల పరిశీలన కోసం ఒక బృందం కార్యాలయంలో ఉంటే, మరో బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లనుంది. ఈ కార్యక్రమంలో కమిషనర్ మౌర్య, డీటీసీపీ అదనపు డైరెక్టర్ శ్రీనివాసులు, డీసీపీ మహాపాత్ర, ఏసిపి లు బాలాజి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

- పెండింగ్ టీడీఆర్ బాండ్లు : 587
- రెండు రోజుల్లో వచ్చిన దరఖాస్తులు : 115
- శనివారం వచ్చినవి : 67
- టీపీఎస్ లాగిన్‌కి వెళ్లినవి : 48



కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

రెండు కార్లు, కత్తులు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

6



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు



సంఘసంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ వెంకటేశ్వర్ నివాళులర్పించారు. బడుగు వర్గాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.



సీజేఐ దంపతులకు ప్రసాదాలు అందిస్తున్న ఈవో శ్యామలరావు

అమ్మవారి సేవలో సీజేఐ

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా శనివారం రాత్రి తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద టీటీడీ ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, జేఈవో వీరబ్రహ్మం, అర్చకులు ఆలయ మర్యాదలతో జస్టిస్‌కు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించి, అమ్మవారి మూలవర్లను దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయనతో పాటు పలువురు న్యాయమూర్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సీజే రాక సందర్భంగా ఆలయం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

'కల్కి2'కి ఇంకా టైం ఉంది
నాగ్ అశ్విన్

రెబల్ స్టార్ ప్రభాస్ 'కల్కి-2'పై దర్శకుడు నాగ్ అశ్విన్ స్పందించారు. తిరుమల శ్రీవారిని శనివారం సుప్రభాతసేవలో దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కల్కి సెకండ్ పార్టు ఎప్పుడు రాబోతోందని మీడియా అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ఇంకా టైం పడుతుందన్నారు. కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకోడం సంతోషంగా ఉందన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని అన్ని కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.73 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,327

తలనీలాలు సమర్పించినవారు: 26,354



సప్తగిరుల్లోనూ మార్మోగే శ్రీరామనామం

అన్ని అర్చనలు, సేవల్లోనూ ఆయనకు స్థానం

నేడు శ్రీరామనవమి ఆస్థానానికి ఘనంగా ఏర్పాట్లు



కౌసల్యా సుప్రజా రామా...

యుగపురుషుడు శ్రీరామచంద్రమూర్తి త్రేతాయుగానికే పరిమితం కాదు. కాలమేదైనా ధర్మానికీ, జనరంజక పాలనకూ ఆయనే ఆదర్శం. కలియుగ వెంకన్న కొలువైన తిరుమలలోనూ ఈ జగదభిరాముడి ప్రస్తావన వినిపిస్తూనే ఉంటుంది. కనిపిస్తూనే ఉంటుంది. శ్రీవారిని మేలుకొలుపే 'కౌసల్యా సుప్రజారామా, పూర్వా సంధ్యా ప్రవర్తతే...' అంటూ ఈ జగదానందకారకుడి నామ స్మరణతోనే లోకాన్ని మేల్కొలుపుతారు. తిరుమల క్షేత్రంలో కొలువుదీరి ఉన్న శ్రీరాముడి విగ్రహం వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగింది. తిరుమల శ్రీనివాసుడితో పాటు పూజలందుకుంటోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అదిగదిగో రాములవారి మేడ

తిరుమల బంగారువాకిలి నుంచి వేంకటేశ్వరుడి గర్భాలయంలోకి వెళ్లే మార్గంలో స్నపనమండపం దాటగానే 'రాములవారిమేడ' దర్శనమిస్తుంది. అక్కడ రాములవారి పరివారమైన అంగద, హనుమంత, సుగ్రీవుల విగ్రహాలుంటాయి. ప్రస్తుతం గర్భాలయంలో శ్రీనివాసుడి మూలమూర్తితో పాటు సీతారామలక్ష్మణుల విగ్రహాలు పూజలందుకుంటున్నాయి. ఈ విగ్రహాలు పూర్వం రాములవారిమేడలో ఉండేవని చెబుతారు. అందువల్లే రాములవారి మేడగా పిలుచుకుంటున్నారు.

తెప్పోత్సవాల్లో తొలిరోజు విహారం

ఏటా ఐదు రోజుల పాటు జరిగే వార్షిక తెప్పోత్సవాల్లో తొలిరోజు తెప్పపై కొలువుదీరేది శ్రీరామచంద్రుడే. పుష్కరిణిలో తెప్పపై సీతాలక్ష్మణ ఆంజనేయ సమేతంగా నీలమేఘశ్యాముడు దివ్యతేజస్సుతో విహరిస్తూ భక్తకోటికి దర్శనమిస్తారు. వసంతోత్సవాల్లో తొలి రెండు రోజులు మలయప్పస్వామికి స్నపన తిరుమంజనం నిర్వహించే అర్చకులు చివరిరోజు కృష్ణస్వామిని, రాములవారిని ఒకే వేదికపై కొలువుదీర్చుతారు. వారికీ స్నపనం నిర్వహిస్తారు. ఒకే వేదికపై కనిపించే ఈ ఇద్దరు యుగపురుషులను చూడటానికి భక్తులు ఎంతో ఆసక్తి కనబరుస్తారు.

బ్రహ్మోత్సవాల్లో కోదండరాముడిగా దర్శనం

ఏటా బ్రహ్మోత్సవాల్లోనూ ఆరో రోజు హనుమంత వాహనంపై శ్రీవారే కోదండరాముడిగా మాడవీధుల్లో విహరించి దర్శనమిస్తారు. త్రేతాయుగంలో తనకు సేవ చేసిన భక్త శిఖామణి హనుమంతుడిని వాహనంగా చేసుకుని తిరువీధుల్లో ఊరేగుతారని చెబుతారు. హనుమంతుడి భక్తి తత్పరతను ఈకాలం నాటి వారికి చాటిచెబుతూ రాముడు, కృష్ణుడు, వేంకటేశ్వరుడు అన్నీ తానేనని తెలియజేస్తారు. రథసప్తమి నాడూ హనుమంత వాహనంపై దర్శనమిస్తారు.

జన్మనక్షత్రం నాడు ఊరేగింపు

ఆయా మాసాల్లో వచ్చే ప్రత్యేక నక్షత్రాలకు తగినట్టు మలయప్పస్వామి దర్శనమిస్తుంటారు. శ్రీరాముడు జన్మనక్షత్రమైన పునర్వసు రోజున శ్రీవారి ఆలయంలో ఆస్థానం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సీతారామలక్ష్మణస్వామిని పీఠంలో అధిరోహింపజేసి విశేష అభరణలు, పూలమాలలతో అలంకరించి సహస్ర దీపాలంకార సేవను నిర్వహిస్తారు. శ్రీరామచంద్రమూర్తి ఆంజనేయస్వామి సమేతంగా తిరుమాడవీధుల్లో ఊరేగుతారు.

తిరుమల వీధుల్లో ఊరేగుతున్న శ్రీరామచంద్రమూర్తి (ఫైల్‌ఫొటో)



ప్రియ సేవకుడు కొలువుదీరిందిక్కడే

రాముడి విశ్వాసపాత్రుడైన సేవకుడు ఆంజనేయస్వామి కొలువైంది కూడా ఏడుకొండల్లోని అంజనాద్రే. తల్లి అంజనాదేవితో కలిసి బాలాంజనేయస్వామి నేటికీ ఆకాశగంగ తీర్థం వద్ద భక్తులకు దర్శనమిస్తున్నారు. అంజనాద్రే ఆంజనేయుడి జన్మస్థలమని ఇటీవల కొన్ని పండిత బృందాలు కూడా శాస్త్రపరంగా నిరూపించాయి. విశిష్టత కలిగిన జపాలి క్షేత్రం కూడా అంజనాద్రిపైనే వెలసింది. జపాలి మహర్షి కోరిక మేరకు ఆంజనేయస్వామికి స్వయంభువుగా వెలసినట్టుగా చారిత్రక ఆధారాలున్నాయి. స్కందపురాణం, వేంకటాచల మహత్యంలోనూ ఈ క్షేత్రం గురించి ప్రస్తావించారు. రావణ సంహారం తర్వాత సీతా సమేతంగా ఆయోధ్యకు వెళ్లే ముందు శ్రీరాముడు జపాలి తీర్థంలో కొంతకాలం విడిది చేసినట్టు మరో ఐతిహ్యం ప్రాచుర్యంలో ఉంది.

నేడు శ్రీరామనవమి ఆస్థానం

శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ఆస్థానాన్ని వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రంగనాయక మండపంలో సీతాలక్ష్మణ సమేత హనుమంతుల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. వేదమంత్రోచ్చరణల నడుమ అభిషేకం చేస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు హనుమంతవాహన సేవ జరుగనుంది. రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య బంగారువాలికిలో శ్రీరామనవమి ఆస్థానం నిర్వహిస్తారు. మరుసటి రోజు రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య శ్రీరామ పట్టాభిషేకాన్ని వైభవంగా చేపట్టనున్నారు.

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు
రెండు కార్లు, కత్తులు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి జీవకోనలో కుటుంబ సభ్యుల కిడ్నాప్ కేసులో ఇద్దరు నిందితులను శనివారం అలిపిరి పోలీసులు అరెస్టు చేశారు. శనివారం డీఎస్పీ శ్రీలత మీడియాకు తెలిపిన వివరాలివి.... తిరుపతి జీవకోనలో ఉంటున్న కసారం రాజేష్ మీ-సేవ నిర్వహిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన డ్రైవర్ భార్గవ్ ఇతనికి స్నేహితుడు. రాజేష్‌కు అతని తల్లి విజయ పేరుతో విలువైన పొలాలు, ఆస్తులున్నాయని భార్గవ్ తెలుసుకున్నాడు. దీంతో రాజేష్‌ను, కుటుంబసభ్యులను బెదిరించి రూ.2 కోట్లు లాక్కోవాలని పథకం పన్నాడు. బీ-టెక్ చదివి అప్పటికే నేరాలతో సంబంధమున్న వట్టికుంట అరుణ్‌కుమార్‌తో చేతులు కలిపాడు. పన్నాగంలో భాగంగా గతనెల 28న రాజేష్‌కు ఫోన్ చేశారు. బీమా పాలసీ చేయించడానికి తల్లిని తీసుకురావాలని నమ్మపలికారు. దీంతో రాజేష్ తన తల్లిని తీసుకుని భార్గవ్ ఉంటున్న ఫ్లాట్‌కు వచ్చాడు. అరుణ్, భార్గవ్‌లు వెంటనే వారిద్దరినీ గదిలో బంధించారు. ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఉన్న రూ1.5 కోట్లు డ్రా చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారు స్పందించకపోవడంతో రాజేష్ భార్య సుమతి, ఇద్దరు చిన్న పిల్లలను కూడా తీసుకొచ్చారు. అయినా చలించకపోవడంతో మరుసటి రోజు (29న) తెల్లవారుజామున సుమతి, ఆమె అత్తను, ఇద్దరు పిల్లలను కిడ్నాప్ చేసి కారులో బెంగళూరుకు వెళ్లారు. మరో వాహనంలో రాజేష్‌ను కిడ్నాప్ చేసి చిత్తూరు వైపు బయలుదేరారు. అయితే ఐతేపల్లి వద్ద రాజేష్ చాకచక్యంగా వాహనం బ్రేక్ వేసి డోర్ తీసి కారు నుంచి బయట పడ్డాడు. దీంతో అరుణ్‌కుమార్ ఆగ్రహంతో రాడ్‌తో రాజేష్‌పై దాడి చేసి అదే వాహనంలో వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన రాజేష్ వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు జరిగిన విషయం తెలియజేశాడు. స్థానికులు అతడ్ని తిరుపతి రుయాలో చేర్పించాడు. తమ ప్లాన్ బెడిసికొట్టిందని తెలుసుకున్న నిందితులు రాజేష్ తల్లి విజయను చిత్తూరులో వదలిపెట్టారు. సుమతిని బెంగళూరులోని ఆమె పుట్టింటి సమీపాన విడిచివెళ్లారు. పిల్లలను కూడా వదిలేశారు. అలిపిరి పోలీసులు కిడ్నాప్ కేసును సీరియస్‌గా పరిగణించారు. గాలింపు ముమ్మరం చేశారు. రేణిగుంట-కడప రోడ్డులో కుక్కల దొడ్డి వద్ద ప్రధాన నిందితులు అరుణ్‌కుమార్, భార్గవ్‌లతో పాటు పలు కేసులతో సంబంధమున్న సాయికుమార్, మణికంఠ, ప్రకాష్, గణేష్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కార్లు, ఏడు మొబైల్ ఫోన్లు, నాలుగు కత్తులు, మత్తు పదార్థాలు, ఐరన్ రాడ్‌తో పాటు వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్టులో కీలక పాత్ర పోషించిన సీఐ రాంకిషోర్, ఎస్ఐలు లోకేష్‌బాబు, నాగార్జున రెడ్డిలను ఎస్పీ అభినందించారు.

నిందితులు పాతనేరస్థులే..

కిడ్నాప్ యత్నం కేసులో నిందితుడు అరుణ్‌కుమార్‌ది గరుడాద్రినగర్. ఇతనే ఈ వ్యవహారమంతా నడిపించాడని పోలీసులు గుర్తించారు. 2015లో స్నేహితుడు దిలీప్‌ను మోసం చేసి హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడు. ఇతడిపై నాలుగు క్రిమినల్ కేసులు, ఏటీఎం చోరీ కేసు, కిడ్నాప్ కేసులు, ఇతర ఆర్థిక మోసాల కేసులున్నాయి. రౌడీ షీట్ కూడా ఉంది. మరో నిందితుడు భార్గవ్‌పై హత్య కేసుతో పాటు కిడ్నాప్, బైండోవర్ కేసులు నమోదయ్యాయి. ఇతనిపై తిరుపతి పోలీసులు రౌడీషీట్ నమోదు చేశారు.

జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యుల ఎంపిక కమిటీలో పద్మావతి వర్సిటీ ప్రొఫెసర్



కలికిరి/కడప, ఏప్రిల్ 5 (ఆంధ్ర జ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఏర్పాటు కానున్న జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యులను ఎంపిక చేసేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాయచోటితో పాటు రాష్ట్రంలోని మిగతా 13 కొత్త జిల్లా కేంద్రాల్లో జువెనైల్ జస్టిస్ బోర్డులు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు బోర్డులో ఛైర్మన్, సభ్యుల పదవుల కోసం ఆసక్తి ఉన్నవారు ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు పంపుకోవాలని కోరుతూ ప్రభుతవం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ బోర్డుకు అర్హులైన ఛైర్మన్, సభ్యులను ఎంపిక చేయడానికి తాజాగా ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కమిటీ ఛైర్మన్‌గా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావును నియమించారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆ శాఖ కార్యదర్శి వ్యవహరించనున్నారు. సభ్యులుగా తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వి.లలితకుమారి, కడప యోగివేమన వర్సిటీ సైకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లలిత, ఏపీ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతితో పాటు ఒక యునిసెఫ్ ప్రతినిధి, సౌత్ రీజినల్ రిసోర్స్ సెంటర్ ఫర్ చిల్డ్రన్ ఇండియా ఫౌండేషన్ నుంచి మరో ప్రతినిధినితో ఈ ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటయింది. మూడేళ్లపాటు ఈ కమిటీ కార్యకలాపాల్లో పాల్గొంటుందని పేర్కొంటూ రాష్ట్ర స్త్రీ, బాలల, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి ఆదేశాలు జారీ చేశారు.

సైనిక్‌స్కూల్ ప్రవేశ పరీక్షకు 1,888 మంది హాజరు



ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేసి లోనికి అనుతిస్తున్న అధికారులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ప్రవేశాలకు నేషనల్ టెస్ట్ ఏజన్సీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు జిల్లాలో 1,888 మంది హాజరయ్యారు. తిరుపతిలో నాలుగు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల, గీతం, శ్లోక ఎ బిర్లా, ఢిల్లీ పబ్లిక్ స్కూళ్లలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఎన్‌టీఏ నిబంధనల ప్రకారం పరీక్ష సమయానికి అర్ధగంట ముందే 1.30 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మధ్యాహ్నం 12 గంటల నుంచే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలకు 2,125 మంది దరఖాస్తు చేసుకోగా 237 మంది గైర్హాజరయ్యారని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ టి.కైలాస్‌నాథ్ చెప్పారు.

వైభవంగా మూడో రోజు ఉరుసు మహోత్సవం

- దర్గాను దర్శించుకున్న న్యాయమూర్తులు
- సందడి చేసిన జబర్దస్త్ హైపర్ ఆది బృందం

నాయుడుపేట/టౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో హిందు, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా కులమతాలకు అతీతంగా జరుపుకునే హజరత్ అమీర్‌షావలి గంధోత్సవ వేడుకలు శనివారంతో ముగిశాయి. మూడోరోజు హజరత్ అమీర్‌షావలి దర్గాను నాయుడుపేట, సూళ్లూరుపేట న్యాయమూర్తులు అనిల్, అనూష, సంయుక్తలు దర్శించుకున్నారు. చివరిరోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్గాను దర్శించుకున్నారు. రాత్రి సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం హాజరై సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. జబర్దస్త్ హైపర్ ఆది తన బృందంతో వినోదం పంచారు. కార్యక్రమంలో శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, 786 రఫీ, ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, నెలవల రాజేష్, మధురెడ్డి, సుబ్బారావు, నారాయణ, రవి, చెంగయ్య, పసల గంగాప్రసాద్, మైలారి రాజశేఖర్, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దర్గాను దర్శించుకుంటున్న హిందూ ముస్లింలు

అందరూ ఇచ్చినా ఆయనొక్కడే!
శ్మశాన దారికి భూమిచ్చేందుకు ససేమిరా అన్నరైతు



కొలతలు తీసి రాళ్లు నాటుతున్న అధికారులు

పుత్తూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపురానికి శ్మశాన దారి సమస్య చాలా రోజులుగా ఉంది. గ్రామానికి, శ్మశానానికి మధ్య దాదాపు రెండు కిలోమీటర్లుండడంతో శవాలను పొలాల మీద తీసుకువెళ్లాల్సి వస్తోంది. పొలాలన్నీ పట్టా భూములే కావడంతో 35 మంది పట్టాదారుల అంగీకారంతో దారి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఉచితంగా పట్టా భూములు ఇచ్చేందుకు 34 మంది రైతులు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఓ రైతు మాత్రం భూమిని ఇచ్చేందుకు ససేమిరా అన్నారు. రెండు రోజుల క్రితం ఇక్కడకు వచ్చిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి ఈ సమస్య వెళ్లింది. వారి ఆదేశాల మేరకు తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ సురేంద్రనాయుడు, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగ రెడ్డి, వామపక్ష నాయకులు వెంకటేశం, గ్రామస్తులు కలిసి ఆ రైతును ఒప్పించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ రైతు కోల్పోయే ఒకటిన్నర సెంటు భూమికి గ్రామంలో సేకరించిన రూ.మూడు లక్షలను పరిహారంగా ఇస్తామని నచ్చజెప్పారు.అయినా ఆయన స్పందించకపోవడంతో షణ్ముగరెడ్డి చొరవ తీసుకుని పుత్తూరు పట్టణంలో మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని ఇప్పిస్తామని చెప్పారు. అయినా సమ్మతించని ఆ రైతు ఓ దశలో అసహనానికి గురై తనపై ఒత్తిడి తెస్తే చీటీ రాసి చచ్చిపోతానని స్పష్టం చేశారు. దీంతో ఏమి మాట్లాడాలో అర్థంగాని అధికారులు, ప్రజాప్రతినిధులు అప్పటికే అంగీకరించిన 34 మంది రైతుల పట్టా భూముల్లో కొలతలు వేసి రాళ్లు నాటి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. పది రోజుల తర్వాత మరోసారి రైతుకు కౌన్సెలింగ్ ఇచ్చి సమస్యను పరిష్కరించాలని భావిస్తున్నారు.

జగన్ బొమ్మ ఉన్న పాస్ పుస్తకాలు ఇక చెల్లవు

డక్కిలి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ బొమ్మతో ముద్రించిన పాస్ పుస్తకాలు ఇకపై చెల్లవని, వాటిని వెనక్కి ఇచ్చేసి కొత్తగా ముద్రించినవి పొందాలని తహసీల్దారు మోహూరు శ్రీనివాసులు రైతులకు సూచించారు. డక్కిలి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించిన పాస్ పుస్తకాలపై గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ బొమ్మను ముద్రించి అందజేశారని, ప్రస్తుతం వాటిని తిరిగి ఇచ్చేసి కొత్తవి తీసుకోవాలని రైతులకు సూచించారు. అంతేకాకుండా నవరత్నాల పేరుతో అమలు చేసిన ప్రభుత్వ పథకాలపై ముద్రించిన జగన్ బొమ్మలన్నిటినీ తొలిగించడం జరిగిందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన 30 జీవో ప్రకారం గయాళి, అనాధీన భూములను ఆక్రమించుకుని నిర్మించుకొన్న ఇళ్లను క్రమబద్ధీకరించి హక్కులు కల్పిస్తామని చెప్పారు. ఎంపీపీ రాజశేఖర్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ఒక్కో ఎంపీటీసీ సభ్యుడికి మండల గ్రాంటు నుంచి రూ.2 లక్షలు కేయించామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గడ్డం చంద్రశేఖరరెడ్డి, ఎంఈవో వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ ఏడీ నాగార్జనసాగర్, ఎంపీడీవో గుణశేఖరరెడ్డి, పంచాయతీరాజ్‌చ ఆడబ్ల్యూఎస్ ఏఈలు చంద్రశేఖర్, నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

రేణిగుంట అర్బన్ సీఐకి చార్జి మెమో

- ఎస్ఐ అరుణ్‌కుమార్‌పై విచారణకు ఎస్పీ ఆదేశం

రేణిగుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ నుంచి అంతర్రాష్ట్ర దొంగ పారిపోయిన ఘటనలో అర్బన్ సీఐ శరత్‌చంద్రకు ఎస్పీ చార్జి మెమో జారీ చేశారు.అలాగే అర్బన్ ఎస్ఐ అరుణ్ కుమార్‌రెడ్డిపై విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల అంతర్రాష్ట్ర దొంగ పరారైన ఘటనపై ఎస్పీ హర్షవర్ధన్ రాజు సీరియస్ కావడంతో ఇద్దరు ఐడీ పార్టీ కానిస్టేబుళ్లపై ఇదివరకు సస్పెన్షన్ వేటు పడగా ఇదే ఘటనపై స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ బాధ్యత వహిస్తూ సీఐకు చార్జి మెమో జారీ చేశారు.ఈ ఘటనపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డిపై ఎస్పీ పోలీసులు విచారణ చేసి ఎస్పీకి రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

ఇబ్బందులు తొలగి అభివృద్ధివైపు అడుగులు..

- ఎమ్మెల్సీ సోము వీర్రాజు

తిరుమల, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దయతో రాష్ట్రంలోని ఇబ్బందులన్నీ తొలిగి అభివృద్ధివైపు అడుగులేస్తున్నామని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బీజేపీ నేతలు సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద్, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డితో కలిసి ఆయన శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. 2014 నుచి 2024 వరకు అనేక ఇబ్బందులు పడ్డామని, ప్రస్తుతం రాష్ట్రం రాజధాని, స్టీల్ ప్లాంట్, పోలవరం వంటి అనేక అంశాల్లో ప్రగతిని సాధిస్తోందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఈ వయస్సులోనూ నిరంతరం పర్యటన చేస్తున్నారని, వారితో పాటు డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ కూడా అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. వారి ఆరోగ్యాన్ని కాపాడేలా ఆశీర్వదించమని శ్రీవారిని కోరుకున్నట్టు చెప్పారు. ఇక, శ్రీవారి నిధులను ధర్మానికే కేటాయించాలన్నారు. ఈ సంకల్పంతో భానుప్రకాష్ రెడ్డి పనిచేస్తున్నారని ప్రసంశించారు.



నవమి వేడుకలకు కోదండరామాలయం ముస్తాబు



కోదండరామాంజనేయస్వామి ఆలయం

గూడూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనేటిమిట్టలో ఉన్న కోదండ రామాంజనేయస్వామి ఆలయాన్ని శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబైంది. ఆలయంలో ఈనెల 7వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 8న శేషవాహనం, 9న హంసవాహనం, 10న సంహవాహనం, 11న హనుమంతసేవ, 12న గరుడసేవ, 13న కళ్యాణోత్సవం, 14న రథోత్సవం, 15న ఆశ్వవాహనం, 16న వసంతోత్సవం, 17వ తేదీన ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

మండలాభివృద్ధికి సహకరించండి



సీఎం చంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న కృష్ణయ్య

పెళ్లకూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలాభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి టీడీపీ మండలాధ్యక్షుడు నంచి కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. శనివారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసిన కృష్ణయ్య మండలంలో సమస్యలను వివరించారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో పెళ్లకూరు మండలం అభివృద్ధిలో అట్టడుగున ఉందని వాపోయారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గురుకుల పాఠశాలలు, కళాశాలలు, ఐటీఐ తదితర విద్యా సంస్థలు ఉన్నాయని, పెళ్లకూరు మండలంలో మాత్రం అలాంటి ప్రత్యేక విద్యాసంస్థలు లేవన్నారు. గతంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినా, ఆచరణకు నోచుకోలేదన్నారు. స్పందించిన సీఎం సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కృష్ణయ్యకు సూచించారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 5: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని పట్టణంలో శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. స్థానిక రెండో పట్టణ పరిధిలోని తిలక్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం నుంచి కోనేటిమిట్టలోని కోదండరామాంజనేయస్వామి ఆలయం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మురళీరెడ్డి, కోట సునీల్ కుమార్, ఆరీకట్ల బాలకృష్ణమ నాయుడు, పేటేటి చంద్రనీల్, మనోజ్ కుమార్, మల్లికార్జున్, శ్యామ్, దయాకర్, శ్రీహరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

వాకాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని తన నివాసం వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీ అత్యధిక స్థానాలు గెలుచుకుందన్నారు. కార్యక్రమంలో పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బస్సు: ఒకరి మృతి

తడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆటోను బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. అండగుండాల గ్రామానికి చెందిన చిన్నయ్య (42) బంధువు కుమార్‌తో కలిసి శుక్రవారం రాత్రి ఆటోలో అక్కంపేటకు వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి ఆటోలో వెళ్తుండగా చేనిగుంట జాతీయ రహదారి మలుపు వద్ద చెన్నై నుంచి హైదరాబాదుకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నయ్య, కుమార్ గాయపడ్డారు. వారిని తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం చిన్నయ్య మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో







యడపూడి, దిగువ కలవకూరు, ఎగువ కలవకూరు వద్ద అధ్వానంగా ఉన్న వంతెనలు

శిథిల వంతెనలు.. ప్రమాద నిలయాలు

వాహనదారుల అవస్థలు ● పట్టించుకోని అధికారులు

పెళ్లకూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అయిదు మండలాల ప్రజల సౌకర్యార్థం పెళ్లకూరు మండలంలోని కోనేటిరాజుపాలెం నుంచి పాలచ్చూరు, పెరుమాళ్లపల్లి, అనకవోలు, కలవకూరు, ముమ్మారెడ్డిగుంట గ్రామాల మీదుగా కొణతనేరి వరకు సుమారు 20 కిలో మీటర్ల రహదారిని నిర్మించారు. ఈ మార్గంలో యడపూడి, దిగువ కలవకూరు, ఎగువ కలవకూరు, ముమ్మారెడ్డిగుంట గ్రామాల సమీపంలోని పంటకాలువలపై 1967లో వంతెనలు నిర్మించారు. ఈ మార్గంలో పెళ్లకూరు, తొట్టంబేడు, బాలయపల్లి, నాయుడుపేట, ఓజిలి మండలాల ప్రజలతో పాటు మేనకూరు సెజ్‌కు వెళ్లే కార్మికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కాలువలపై వంతెనలు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే స్థితిలో ఉన్నాయి. ముఖ్యంగా యడపూడి, కలవకూరు సమీపాన ఉన్న వంతెనలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇటీవల ముమ్మారెడ్డిగుంట వద్ద వంతెన కుంగిపోయి గొయ్యిలు ఏర్పడ్డాయి. వాహనదారులు గొయ్యిలో ఇరుక్కుని ప్రమాదాలకు గురయ్యారు. ఇటీవల వరి ధాన్యం బస్తాలతో వెళుతున్న ట్రాక్టర్ వంతెనపై కుంగిపోయి బస్తాలు కాలువలో పడ్డాయి. శిథిలమైన వంతెనల స్థానంలో కొత్తవి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.







గూడూరులో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా - సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే విజయశ్రీ - వెంకటగిరిలో జగ్జీవన్‌రామ్ జయంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

గూడూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి ఎంతో కృషిచేసిన మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ లాంటి మహనీయులను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని టవర్‌క్లాక్ కేంద్రం వద్ద జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, వాటంబేడు శివకుమార్, ఆదూరు రత్నం, శ్రీనివాసులు, పౌలు, సుందరం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టవర్‌క్లాక్ సెంటర్ వద్ద జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ నివాళులర్పించారు. టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, కొక్కు శంకరయ్య, చిట్టేటి పెరుమాల్, మాధవనాయుడు, తిరుపాల్, సుబ్రమణ్యం, హనుమంతరావు పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వెంకటాచలపతి, ఎమ్మార్పీఎస్ నాయకులు సారథాకుమార్, చంద్రబాబు, చెంగమ్మ తదిరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణంలో త్రిభువని సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, ఎంపీపీ తనూజారెడ్డి, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, టీడీపీ నాయకులు పునుగోటి విశ్వనాథనాయుడు, బీరం రాజేశ్వరావు, శ్రీనివాసులు నాయుడు, తోట రామచంద్రయ్య, మంకు ఆనంద్, మల్లారం బాబు, రాపూరు శ్రీనివాసులు, చెంగారావు, నర్సింహులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడిగా శ్రీరాముడు



సూళ్లూరుపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బాలాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి వసంతోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీరాముడు శ్రీకృష్ణుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాకచర్ల రమేష్ తెలిపారు.

సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ





గూడలి పురవీధుల్లో ఊరేగుతున్న స్వామివారి పుట్టబంగారం - అఖండ దీపం వెలిగిస్తున్న కార్తీక్‌శర్మ

కోట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలిలో వెలసిన కామాక్షీదేవి సమేత సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు స్వామివారి పుట్టబంగారం, ఉత్సవ విగ్రహాలతో మేళతాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రధానార్చకులు కార్తీక్ శర్మ అఖండ దీపం వెలిగించి యువకులకు కంకణాలు కట్టారు. ఆదివారం ధ్వజారోహణం జరుగుతుంది.

హామీలన్నీ నెరవేరుస్తాం: పాశం

కోట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కొక్కుపాడులో టీడీపీ సీనియర్ నేత పలగాటి భాస్కర్‌రెడ్డి నివాసంలో శనివారం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సీనియర్ నేతలతో సమీక్ష నిర్వహించారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, తెలుగు రైతు కార్యదర్శి మోహన్‌రెడ్డి, సురేష్‌బాబు, వాకా విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, వెంకన్నపాళెం సర్పంచ్ కోకర్ల మధుయాదవ్, పోలయ్య, జితేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

చిట్టమూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం పిట్టివానిపల్లి గ్రామానికి చెందిన విజయమ్మ(50) శనివారం రాత్రి గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కథనం మేరకు.. ఇంటి స్థలం విషయమై అదే గ్రామానికి చెందిన మరో మహిళతో విజయమ్మ గొడవపడ్డారు. మనస్థాపానికి గురైన విజయమ్మ ఇంట్లోనే గుళికలు తినింది. భర్త రామయ్య ఇంటికి రాగా భార్య అపస్మారక స్థితిలో పడి ఉండడంతో ఎంటనే కోట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

నేత్రదానం



బాలకృష్ణారెడ్డి (ఫైల్‌ఫొటో)

తడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలమలుగు గ్రామానికి చెందిన వేనాటి బాలకృష్ణా రెడ్డి(93) శనివారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజా సేవా సంస్థ ఆధ్వర్యంలో చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రికి అందజేశారు.

15, 16 తేదీల్లో ఓపెన్ క్యారమ్ టోర్నమెంట్

గూడూరు అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని కాస్మోపాలిషియన్ క్లబ్‌లో ఈనెల 15, 16 తేదీల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లా ఓపెన్ క్యారమ్ టోర్నమెంటు నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రతినిధులు శనివారం తెలిపారు. మొదటి బహుమతిగా రూ.4వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడో బహుమతి రూ.2వేలు, నాలుగో బహుమతి రూ.1000 అందజేస్తామన్నారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో పోటీలను నిర్వహిస్తామని, వివరాలకు 9885835526 (సుధాకర్), 9490776867(ప్రసన్నకుమార్) నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

దివ్యాంగులకు నిత్యావసరాలు

గూడూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో శనివారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, డాక్టర్ తనూజ, అనిత, జానా సుధీర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.